
# సూర్య
www.suryaa.com

## ఆదివారం

3.11.2024

## తెలంగాణ సాంస్కృతికి ప్రతీక

# సదర్ ఉత్సవం

## చైర్మన్‌తో ముఖాముఖి



నూకారపు సూర్యప్రకాశరావు
చైర్మన్, నేటి దిన పత్రిక సూర్య

**ఓర్వకల్లులో డ్రోన్ హబ్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించడం వెనుక అనేక కారణాలు ఉన్నాయని పిస్తోంది. ప్రత్యేక హబ్ ఏర్పాటుతో తయారీ పరిశ్రమలు, డ్రోన్ టెస్టింగ్ సదుపాయాలు అందుబాటులోకి వస్తాయనిపిస్తోంది. మీరేమంటారు సర్**

**కె. వినయ్ కుమార్, విజయవాడ**

మీరన్నది నిజమే వినయ్‌గారూ... వీరు చెపుతున్నది నిజమే .. శిక్షణ, సర్టిఫికేషన్, అసెంబ్లింగ్ యూనిట్లు, రిపేర్లు, నిర్వహణ సేవలు, డాస్ (డ్రోన్స్ యాజ్ ఎ సర్వీస్) ఎకోసిస్టం అభివృద్ధి చెందుతుంది . ఈ సదుపాయాలతో అంకుర పరిశ్రమలు పెరుగుతాయని చెప్పారు. ఏపీలో డ్రోన్ సంబంధిత వ్యాపారాలకు అవసరమైన అన్ని అనుమతులను సింగిల్ విండో విధానంలో ప్రభుత్వం అందిస్తుంది

ఓర్వకల్లులో ఏర్పాటు వెనుక దగ్గరలో ఉన్న కర్నూలు విమానాశ్రయంలోని రన్‌వేను డ్రోన్ల పరిశీలనకు వినియోగించుకోవచ్చు. డ్రోన్ తయారీ పరిశ్రమలకు అవసరమైన అనుబంధ కంపెనీల ఏర్పాటుకు 10,000ల ఎకరాల వరకు అందుబాటులో ఉంటుంది. హైదరాబాద్– బెంగళూరు నగరాలకు దగ్గరగానూ ఉంటుంది. ఇక్కడ ఏర్పాటు చేసే సంస్థలకు అనుమతులన్నీ ప్రభుత్వమే సమకూర్చుతుంది. ఫ్లయింగ్ జోన్‌గా ప్రకటించడం వల్ల డీజీసీఏ అనుమతులు అక్కర్లేదు. కాగా ఏపీలో ఇతర ప్రాంతాల్లోనూ డ్రోన్ పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులిచ్చేందుకు అధికారులు సిద్ధమని చెపుతున్నారు. అయితే అవసరమైన డీజీసీఏ, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ అనుమతులు, ఇతర లైసెన్సులు వారే సమకూర్చుకోవాల్సి ఉంటుంది.

అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ఇది మంచి మార్గంగానే కనిపిస్తోంది. డ్రోన్ల రంగంలో మన దేశ వాటా కేవలం 3 శాతమే . దీన్ని కనీసం 20 శాతానికి పెంచాలని కేంద్రం భావిస్తోంది. ఇందులో రానున్న విస్తృత అవకాశాలను అందిపుచ్చుకునేందుకు వీలుగా ఏపీ సర్కార్ విధానాలు రూపొందిస్తోందించేలా ప్రయత్నాలు ఆరంభించింది. . డ్రోన్ల వినియోగానికి విస్తృత అవకాశాలున్న మ్యాపింగ్, సర్వే, వ్యవసాయం, ఫొటోగ్రఫీ, తనిఖీలు, నిఘా రంగాలను కీలకంగా మారనున్నాయి.

'విభిన్న రంగాలు, ప్రభుత్వ శాఖల్లో డ్రోన్ల వినియోగం, ప్రోత్సాహకాలు, కృత్రిమ మేధతో అనుసంధానం, తయారీ రంగాన్ని ప్రోత్సహించే వాణిజ్య విధానం వంటివి అందుబాటులోకి తేవడం. తద్వారా డ్రోన్ అనుకూల వాతావరణాన్ని రాష్ట్రంలో కల్పించాలని యోచిస్తోంది. ఏపీలో డ్రోన్ల రంగం ద్వారా ఐదేళ్లలో రూ.6000ల కోట్ల ఆదాయాన్ని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ రంగంలో రూ.వెయ్యి కోట్ల పెట్టుబడులు 12,500 మందికి ఉపాధి కల్పించేలా ముసాయిదా డ్రోన్ పాలసీని ప్రకటించింది. దీనిపై భాగస్వామ్య పక్షాలు, నిపుణుల సూచనల ఆధారంగా మార్పులు చేసి నవంబరు నాటికి తుది పాలసీని తీసుకొచ్చే ఆస్కారంఉందనిపిస్తోంది.

**హైదరాబాద్ నగరంలోని సమస్యల పరిష్కారంపై దృష్టిసారించాలని హైడ్రా నిర్ణయించినట్టు వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే గత నెల రోజులుగా కమిషనర్ ఏపీ రంగనాథ్ వివిధ రంగాల నిపుణలతో సమావేశాలు నిర్వహించి ప్రణాళికలు రూపొందించడంతొ పాటూ కేవలం కూల్చివేతల కోసమే హైడ్రా ఏర్పడిందన్న ముద్రను చెరిపివేసుకోనేలా ఇతర సమస్యలపై దృష్టి సారించనున్నారనిపిస్తోంది. దీంతో కూల్చివేతలు తాత్కాలికంగా ఆపేయాలని నిర్ణయించారన్నది ఓ వార్త మీరేమండటారు.**

**పసుపులేటి వింధ్యారాణి, ప్రగతినగర్, హైదరాబాద్**

అవును మీరు చెపుతున్నది వాస్తవమే వింధ్యగారూ... తొలి నాళ్లలో కూల్చి వేతలను స్వాగతించిన వారు, అవి విస్తృతమై తమ వరకు వచ్చేసరికి సహించలేకపోతున్నారన్నది వాస్తవం. ఈ క్రమంలో దానిని వ్యతిరేకించడం ఆరంభించారు. దీంతో ఆ అపత్రద తుడుచుకునేలా... గ్రేటర్ పరిధిలో ఇతర సమస్యలపైనా హైడ్రా దృష్టి సారించిందనే చెప్పాలి. తెలంగాణ రాజధానిలో నిత్యం 50లక్షలకు పైగా వాహనాలు రోడ్డెక్కుతున్నాయి. చిన్నపాటి వాన పడినా గంటల తరబడి రోడ్లపై ఉండాల్సిందే. ఈ సమస్యపై ట్రాఫిక్ పోలీసులు, బల్దియా అధికారులతో కలిసి పరిష్కరించాలని ఆలోచిస్తున్నారు. దీని పరిష్కృతం కోసం 2 విద్యా సంస్థలకు సర్వే బాధ్యతలు అప్పగించారు. పరిష్కారాలపై సీఎం రేవంత్ రెడ్డికి ఓ నివేదిక సమర్పించి చర్యలు తీసుకోవాలని భావిస్తున్నారు. వాహన రద్దీ సమస్యతో పాటు ఫుట్‌పాత్, రహదారి ఆక్రమణలపై నగర ట్రాఫిక్ విభాగంతో కలిసి పని చేయాలని నిర్ణయించింది.

నేషనల్ రిమోట్ సెన్సింగ్ విభాగం తీసిన ఫొటోలు, మ్యాప్లతో చెరువు వాస్తవ విస్తీర్ణం, మొత్తం చరిత్రను తీసి నిక్షిప్తం చేసేందుకు యత్నిస్తున్నారు. చెరువులపై ఉన్న ఆక్రమణల్లో దాదాపు 85శాతం నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయి. వీటిని కూల్చడం సాధ్యం కాదని అభిప్రాయపడ్డ హైడ్రా అధికారులు ఉన్న చెరువును పరిరక్షించాలని నిర్ణయించారు. నగరంలోని కొన్ని చెరువుల సుందరీకరణను నవంబరులో ప్రారంభించాలని యోచిస్తున్నారు.

హైదరాబాద్లో సుమారు 200 కి.మీ.ల మేర నాలాలు ఉన్నాయి. వీటిపై సుమారు 15వేల నిర్మాణాలు ఉన్నాయని గతంలో అధికారులు గుర్తించారు. వీటిని కూల్చడం ప్రభుత్వానికి అసాధ్యం. చాలా వాటికి బల్దియా పర్మిషన్స్ ఉన్నాయి. బాధితులకు పరిహారం ఇవ్వాలంటే రూ.వేల కోట్లు కావాల్సిందే. పెద్ద నాలాల పరిధిలో సుమారు 1400 చోట్ల మూడొంతుల ఆక్రమణకు గురై వర్షం నీరు కిందికి వెళ్లడం లేదు. వీటిని తొలగించి నాలాలను విస్తరిస్తే వరద నీటి ముంపు సమస్య తొలుగుతుంది. బల్దియాతో కలిసి దశల వారీగా ఈ పనులు చేయాలని హైడ్రా సిద్ధమైంది.

## లెజెండ్

# గీతాంజలి



నా జన్మస్థలం రాజమండ్రి. మా నాన్నగారి పేరు శ్రీరామ్మూర్తి. అమ్మ శ్యామలాంబ. మేం ఇద్దరు అక్కా చెల్లెళ్ళం. నాన్నగారు నాకు పెట్టిన అసలు పేరు మణి, మా అక్క పేరు స్వర్ణ.

**నా తొలి చిత్రం :** నన్ను సినిమాల్లో చేర్పించాలని నాన్నగారికి కోరిక ఉండేది. ప్రముఖ నృత్య కళాకారుడు, నృత్య దర్శకుడు వెంపటి సత్యం గారి దగ్గర నేను భరత నాట్యం నేర్చుకునేదాన్ని. అదే సమయంలో దర్శకులు బి.ఎ.సుబ్బారావుగారు 'రాణీరత్నప్రభ' చిత్రం నిర్మిస్తున్నారు. ఆ చిత్రంకోసం నాట్యకళాకారులు కావాలని సుబ్బారావుగారు అడగటంతో, మా గురువు వెంపటి సత్యం గారు నాతో సహా నలుగురిని పంపించారు. మా నలుగురిచేతా బిట్లు బిట్లుగా డ్యాన్స్ చేయించారు. ఇందులో నాది భరత నాట్యం పాత్ర.

**హీరోయిన్‌గా తొలి చిత్రం :** 'రాణీరత్నప్రభ' చిత్రంలో రామారావుగారు కథానాయకుడు. అంజలీదేవి గారు కథానాయిక. ఈ సినిమాలో నా భరతనాట్యం చిత్రీకరణ కోసం మా నాన్నగారు నా వెంట సహాయంగా వచ్చారు. నా నృత్య ప్రదర్శన షాట్ల చిత్రీకరణ పూర్తయింది. అప్పుడే ఎన్.టి.రామారావుగారు నన్ను చూశారు. అప్పటికప్పుడే. రామారావు గారు, కమలాకర కామేశ్వరరావుగారు నాన్నగారిని పిలిపించి ఆయన్ను సంప్రదించారు. 'సీతారామ కల్యాణం' చిత్రంలో సీత పాత్ర కోసం అన్వేషిస్తున్నారు. ఆ పాత్రకు మీ అమ్మాయి అయితే సరిగ్గా సరిపోతుంది, ఒప్పుకుంటారా?' అని వారుఇద్దరూ నాన్నగారిని అడిగారు. వెంటనే ఆయన అంగీకరించారు. ఆ విధంగా నాకు 'సీతారామ కల్యాణం' చిత్రంలో అవకాశం వచ్చింది. రాముడి పాత్రలో హరనాథ్‌గారు, రామారావుగారు రావణాసురుడుగా, కాంతారావుగారు నారదుడుగా నటించారు. నటిగా ఇది నాకు రెండవ చిత్రం. హీరోయిన్‌గా మొదటి చిత్రం. ఆ విధంగా డాన్స్ నా జీవితాన్ని మలుపు తిప్పింది.

**నేటికీ వాడవాడలా అదేపాట :** 'సీతారామ కల్యాణం' చిత్రం ఎంతో విజయవంతం అయింది. అంతే కాకుండా, ఆ చిత్రంలోని "శ్రీ సీతారాముల కల్యాణము చూతము రారండీ...." అనే పాట నాటికీ నేటికీ కూడా వాడవాడలా వినిపిస్తూనే ఉండటం ఎంతో గొప్ప విశేషం. అంత హిట్ పాట నాకు మంచి గుర్తిం పు రావడానికీ, నా కెరీర్‌కూ ఎంతగానో దోహదం చేసింది. ఆ చిత్రం తర్వాత ఇతర నిర్మాణ సంస్థల నుంచి కూడా నాకు అవకాశాలు వచ్చా యి. ఐతే రామారావుగారి యన్.ఏ.టి సంస్థతో ఒప్పందం ఉన్న కారణం గా నేను ఎవరికీ కాల్‌షీట్స్ ఇవ్వలేకపోయాను. ఇక్కడ ఒక విషయం ఏమిటంటే, మా అక్క య్యకు కూడా సినిమాల్లో నటించాలని ఎంతో కుతూహలం ఉండేది. అందు కే సినిమా రంగంలో మొదట రెండు సంవత్సరాలూ నా పేరు, మా అక్క పేరు కలిపి నన్ను స్వర్ణమణి అని కూడా పిలిచేవారు. ఈ చిత్రంలో నాది సీత పాత్ర. మా అక్కది శూర్పణఖ పాత్ర. అయితే తర్వాత అక్క భీష్మ, మరో రెండు మూడు చిత్రాల్లో నటించాక పెళ్ళి చేసుకుని వెళ్ళిపోయింది. నేను మాత్రం ఒప్పందం ఉండటం వల్ల ఆ సంస్థలోనే ఉంటూ, సీతారామ కల్యాణంతో పాటు 'గులేబకావళి కథ' చిత్రంలో కూడా నటించాను. రెండేళ్ళ తర్వాత ఇతర నిర్మాణ సంస్థల చిత్రాల్లో కూడా నటించడం ప్రారంభించాను.

**ఎన్టీఆరే నా మొదటి గురువు :** నా మొదటి గురువు రామారావుగారే. డైలాగులు ఎలా చెప్పాలి? ఎలా నటించాలి? హావ భావాలు ఎలా ప్రదర్శించాలి? వంటి అనేక విషయా లు ఎన్.ఎ.టి సంస్థ లోనే నేర్చుకున్నాను. రామా రావుగారి ఫ్యామిలీతో మేమంతా చాలా సన్నిహితంగా, ఒకే కుటుంబంలా ఉండేవాళ్ళం. వాళ్ళ సంస్థలో ఎక్కువ నటించేదాన్ని. నన్ను సినిమా పరిశ్రమలోకి తీసుకువచ్చింది బి.ఎ.సుబ్బారావుగారైతే, నన్ను హీరోయిన్‌గా చిత్రపరిశ్రమకు పరిచయం చేసి, ప్రోత్సహించింది ఎన్.టి.రామారావుగారే.

**ఇల్లాలు చిత్రం :** ఇక ఎల్.వి.ప్రసాద్‌గారి చిత్రం 'ఇల్లాలు'లో నాది కథానాయిక పాత్ర. ఈ చిత్రంలో కథానాయకుడుగా అక్కినేని నాగేశ్వర రావుగారిని అనుకున్నారు గానీ, వారు బిజీ షెడ్యూలులో ఉండటంతో మరో కొత్తబ్బాయితో నటింపజేశారు. ఆయన పేరు కూడా నాగేశ్వరరావే. అందులో నాది ద్విపాత్రాభినయం. ఒకటి సాఫ్ట్ పాత్ర, మరొకటి ఆడరౌడీ పాత్ర. ఈ చిత్రంలో రెండు రకాల పాత్రలను అద్భుతంగా నటించడం, సినిమా పెద్ద హిట్ కావడం, నా నటన సూపర్‌గా ఉందని అందరూ మెచ్చుకోవడంతో నాకు ఈ చిత్రం ద్వారా పరిశ్రమలో ఇంకా మంచి పేరు వచ్చింది. ఒకేసారి ఏడెనిమిది చిత్రాలకు ఆఫర్స్ వచ్చాయి.

**అక్కినేని గారితో...** అక్కినేని నాగేశ్వరరావుగారితో నా మొదటి సినిమా 'డాక్టర్ చక్రవర్తి' నాది అక్కినేని చెల్లెలు పాత్ర. ఆ తర్వాత పద్మనాభంగారి చిత్రం 'పొట్టి ప్లీడర్', తిలక్ గారి దర్శకత్వంలో 'పంతాలు–పట్టింపులు'లో హీరోయిన్‌గా నటించాను. 'దేవత' చిత్రంలో రామారావుగారికి చెల్లెలుగా నటించాను.

(మిగతా వచ్చేవారం)

## నవ కవిత్వం

### పురుగు పడితే..!



మొక్కకు పురుగు పడితే..
మందు పిచికారీతో క్రిమిని
సంహరిస్తాం
చెడు సహవాస చెదలు పడితే..
సద్బుద్ధి మందేసి ఆదిలోనే
తుంచేద్దాం !

తుమ్మ చెట్టుకు గొడ్డలితో కాటు
వేస్తే..
జిగురు బంక ఉబికి కారుతుంది
మనసుకు కాసింత గాయమైతే..
కన్నీరు దారలుగా పారుతుంది !

నెత్తిన పేను పడితే..
దువ్వెనతో ఏరి ఏరి పట్టి చంపుతాం
సమాజంలో నీచులు కనబడితే..
తెలివిగా కంపు కంపను పీకేద్దాం !

పాదానికి చెప్పు సైజు తగ్గితే..
పాదాలకు గాయాల రక్త మరకలు
సైజు పెరిగితే అడుగుల తడబాట్లు..
సంపాదన సరిపోయేంతే ఉండాలి
తక్కువైతే బతుకు వెతల బాధలు
ఎక్కువైతే కొవ్వెక్కి ముసిరే రోగాలు !

బలిసినోడి ప్యాంటుకు ఫ్యాషన్
బొక్కలు
బడుగు చొక్కా తూట్లు కటిక
దారిద్ర్యాలు
నిలువ నీటిలో విపరీత నాచు
పెరుగుద్ది
సదాలోచనేలేని మనిషి మెదడుకు..
దురాలోచనల చెదలు పడుతుంది !


**మధుపాళీ,**
**9949700037**

## లేఖలు

**ముఖచిత్ర కథనం**

తమ కన్న కొడుకు మరణం తీరన వేదన కలిగించిన నేపధ్యంలో తమ కటుంబం వారసత్వం నిర్వీర్యమై పెట్టకూడదన్న లక్ష్యంతో తమ కుమారుడి వీర్యాన్ని కోరుతూ పోరాటం చేసిన తల్లిదండ్రులకు లాల్ సలాం చేయకతప్పదు. వారి పోరాటంం ఫలించిన తీరు పై ప్రత్యేక కథనాన్ని ఆదివారం అనుబంధంలో ప్రచురించడం బాగుంది. అన్ని పత్రికలకు విభిన్నంగా భిన్న అంశాలను ముఖపత్ర కథనాలుగా ప్రచురిస్తున్న మీకు, సంపాదక వర్గానికి, యాజమాన్యానికి ధన్యవాదాలు. ఈ తరహా మరిన్ని కథనాలు ప్రచురించాలని కోరుతున్నాము. సందర్భాను సారంగా మన పత్రికలో ప్రత్యేక వ్యాసా లు రాయించి ప్రచురిస్తున్న మీకు, సంపాదక వర్గానికి కృతజ్ఒతలు. తెలుగు భాషపైనా ఓ ప్రత్యేక కాలమ్ నిర్వహిస్తే బాగుం టుంది. భాషను మర చిపోయి బావ దారిద్రంలో ఉన్న వారికి ఉపయోగ పడుతుందని నా మనవి.

**– వారాంతపు రజనీ, వరంగల్**




**–బి మధుశేఖర్, హైదరాబాద్**

**సినిమా రివ్యూలు బాగున్నాయ్**

వారం వారం విడుదలవుతున్న చిత్రా లలో మంచి చెడ్డలను, నటీ నటులు, సాంకేతిక నిపుణుల పనితీరును అర్ధవంతంగా వివరి స్తున్న విశ్లేషకు లకు ధన్యావాదా లు. ప్రధానంగా థియేటర్లలోకి రాకుండా ఓటిటికే పరిమితమవు తున్న సినిమా లపైనా విశ్లేషణలే చేస్తుండటం హర్షించదగ్గది.

**– ముక్కామలపద్మావతి, హైదరాబాద్**

**కథలు బాగున్నాయి**

వారం వారం ప్రచురిస్తున్న కథలు బాగున్నాయి కొత్త రచయితలకు మీరం దిస్తున్న ప్రోత్సాహం బాగుం ది. . రచిత కథనాన్ని బాగా నడిపిస్తున్నారు. మంచి రచ నలు అందిస్తున్న మీకు ధన్యవా దాలు


**–శ్రీవల్లి తన్మయ్, హైదరాబాద్,**

## సలామ్ సలామ్




అమూల్యం
పోలీస్ యూనిఫామ్ లో
ఒక లుక్
వారు లేకపోతే ఝలక్
శరీరానికి గుండె
అంతర్గత రక్షణకు పోలీస్
పండుగ లేదు పబ్బం లేదు
ఉన్నత అధికారుల వేధింపులు
శ్రమ కు లేదు అలసట
సాంఘిక విద్రోహ శక్తుల
అణచివేత లో ప్రాణాలు హరి
ట్రాఫిక్ మనకు బేపికర్
డ్యూటీ చేసే వాడికి అనారోగ్యపు
ఆనవాళ్లు స్వాగతం
పొట్ట తిప్పాలకు ఉద్యోగం
చెయ్యాలి అవసరమైతే
ఎన్ కౌంటర్
సెలవులు హుష్ కాకి
బిపి,షుగర్,హై టెన్షన్
ఒంట్లో ఏరులై పారుతాయి
పదవి విరమణ వరకు
జీవించే వారి సంఖ్య
ప్చ్ ప్చ్ ప్చ్
టెన్షన్ తట్టు కోలేక ఆత్మహత్యలు
నాయకుల విన్యాసాలకు
భద్రతజి
సలామ్ సలామ్
లేదంటే సస్పెన్షన్
నీతిగా ఉంటే ట్రాన్స్ఫర్
వాళ్ళు లేకపోతే
అంత మిథ్య
డ్యూటీ లో ప్రాణాలు
కోల్పోయిన నిజాయితీ
గల పోలీస్ సోదరుల
త్యాగాలకు ఒక సెల్యూట్
తో సరిపెట్టగలమా
నిరూపమానం నీ సేవలు
నీ త్యాగాల పునాదులు
మమ్ముల్ని నిలబెట్టుతున్నాయి
నీకు వందనం పోలీస్ వీరుడా
నీకు జోహార్ జోహార్

**ఉమాశేషారావు వైద్య**
**9440408080**










సూర్య బుడత

బాలల కథ



# కోడి గర్వం



నరసింహపురంలోని శరభయ్య ఒక కోడిని పెంచసాగాడు. అతడు పెట్టిన దాణా తింటూ ఆ కోడి బలంగా తయారైంది. బలంతో పాటు దానికి గర్వం కూడా ఎక్కువైంది.


ఒకరోజు అది గర్వంతో ఆ గ్రామానికి వచ్చిన సన్యాసి వద్దకు వెళ్లి ఆయనతో " ఓ స్వామీ! నేను చాలా తెలివిగలదానిని. నాకు చాలా బలం ఉంది. నన్ను మించిన వారు ఎవరూ లేరు. నా యజమానికి నేనంటే చాలా ఇష్టం. నన్ను వదిలిపెట్టి ఆయన క్షణం కూడా ఉండలేడు. ఆయన ఇంట్లో నేను ఆడింది, ఆట పాడింది పాట. ఆయనకు సంతానం లేదు. నేనే ఆయన బిడ్డను" అని అంది. అది విన్న సన్యాసి" ఓ కోడీ! నీవు గర్వంతో మిడిసి పడకు. నీకు త్వరలో ప్రమాదం ముంచుకొస్తున్నది. జాగ్రత్త సుమా!"అని హెచ్చరించాడు. కోడిపుంజు ఆయన మాటలను లెక్క చేయలేదు .


ఆ కోడి యజమాని శరభయ్య చాలా బీదవాడు. అతడు తన అవసరం నిమిత్తం ఆ కోడిని ఒక వ్యక్తికి అమ్మజూపాడు. అప్పుడు ఆ కోడికి దిగులు పట్టుకుంది. "ఆ సన్యాసి చెప్పినట్లు తనను ఆ కొనే వ్యక్తి పండుకొని తింటాడేమో !"అని అనుకుంది. అది శరభయ్యతో "అయ్యా! మీకు బిడ్డ లాంటి దాన్ని . చాలా రోజులుగా మన ఇంట్లోనే ఉంటున్నాను. మీరు నన్ను మరొకరికి అమ్మ చూపుతారా! అతడు నన్ను తప్పక చంపి వండుకొని తింటాడు. నాకు మీకు అనుబంధం ఇదేనా!" అని ఏడ్చింది. దాని మాటలు విన్న శరభయ్య తన మనసును మార్చుకొని ఆ ఆసామికి దాన్ని అమ్మనని చెప్పాడు. ఆ వ్యక్తి అక్కడి నుండి వెళ్లిపోయాడు.


"ఆ సన్యాసి చెప్పిన ప్రమాదం తప్పిపోయింది . నా తెలివితోనే మా యజమానిని ఒప్పించి ఈ గండం నుంచి గట్టెక్కాను. ఇదంతా నా గొప్ప తనమే! ఇక నాకు ప్రమాదం లేదు . హ...హ...హ "అని ఆ కోడి నవ్వింది .


ఆ తర్వాత అది సంతోషం తో రోడ్డు పైకి వచ్చింది. ఇంతలో అప్పుడే వచ్చిన వాహనం ఒకటి ఆ కోడిని ఢీకొంది . దానికి తీవ్ర గాయాలైనాయి. అప్పుడు అది "అయ్యో ! విధి వ్రాతను ఎవరూ తప్పించుకోలేరు. ఆ గండం తప్పిందను కుంటే ఈ వాహన రూపంలో మరొక ప్రమాదం జరిగింది . ఇంకా నయం . నా ప్రాణాలు పోలేదు. కొన్ని రోజులు ఈ గాయాల బాధను అనుభవింపక తప్పదు . అందుకే పెద్దలు చెప్పిన మాటను పెడచెవిన పెట్టరాదు. ఆ సన్యాసి చెప్పినట్లు నేను అజాగ్రత్తగా ఉండడం వల్లనే ఈ ప్రమాదం జరిగింది" అని అనుకొంది. అప్పటినుండి అది గర్వం మాని పెద్దలు చెప్పిన మాటలను వింటూ ఎంతో బుద్ధిగా ఉండసాగింది.

**సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,**
**9908554535**







## సుమతీ శతకం

నవ్వకుమీ సభలోపల
నవ్వకుమీ తల్లిదండ్రి నాథులతోడన్
నవ్వకుమీ పరసతితో
నవ్వకుమీ విప్రవరుల నయ మిది సుమతీ !

తా. సభలలో నవ్వరాదు. తల్లిని, తండ్రిని, భర్తను, ఇతరుల భార్యను, బ్రాహ్మణులను చూచి నవ్వరాదు.

# పోలియో-రహితమే కానీ ప్రమాద రహితం కాదు

## పోలియోకు వ్యతిరేకంగా కొనసాగుతున్న పోరాటం

హైదరాబాద్, 29 అక్టోబర్, 2024: భారతదేశంలోని మేఘాలయలో ఇటీవల బయట పడిన పోలియో కేసు నేపథ్యంలో, పోలియోమైలిటిస్ వల్ల కలిగే నిరంతర ముప్పును గుర్తించడం చాలా అవసరం. పోలియో, ఒక తీవ్రమైన వైరల్ అంటువ్యాధి. ప్రధానంగా ఐదేళ్లలోపు పిల్లలను ప్రభావితం చేస్తుంది. ఇది కోలుకోలేని పక్షవాతం మరియు కొన్ని సందర్భాల్లో మరణానికి దారితీస్తుంది. దశాబ్దాలుగా పురోగతి ఉన్నప్పటికీ, ఈ వ్యాధి ప్రపంచ ఆరోగ్యానికి ముప్పుగా మాత్రం మిగిలిపోయింది, ముఖ్యంగా పోలియో రహిత భారతదేశం వంటి దేశాలలో ఇది మరలా రాకుండా నివారించడానికి అప్రమత్తంగా ఉండాలి.

హైదరాబాద్‌లోని కిమ్స్ హాస్పిటల్‌లో పీడియాట్రిక్స్ చీఫ్ గా వ్యవహరిస్తున్న డాక్టర్ నితిన్ చావ్లా మాట్లాడుతూ, "భారతదేశం యొక్క పోలియో రహిత హోదా అనేది నిబద్ధత మరియు సమిష్టి చర్యతో మనం ఏమి సాధించగలమనే దానికి నిదర్శనం. కానీ పోలియోపై పోరాటం మనం సాధించిన దాని గురించి మాత్రమే కాదు-ఇది వేగాన్ని కొనసాగించడం. టీకా ద్వారా నిరంతరం అప్రమత్తంగా ఉండటమే



పునరుజ్జీవనాన్ని నిరోధించడానికి ఏకైక మార్గం అని మన గత విజయం గుర్తు చేసేందుకు ఉపయోగపడుతుంది" అని అన్నారు.

డాక్టర్ నితిన్ చావ్లా నొక్కిచెబుతూ , ప్రతి బిడ్డకు టీకా వేయడానికి ప్రజా అవగాహన కీలకం. రొటీన్ ఇమ్యునైజేషన్ యొక్క ప్రాముఖ్యత గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం వలన పోలియో నుండి బలమైన రక్షణ ఏర్పడుతుందన్నారు.

ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ అడ్వైజరీ కమిటీ ఆన్ వ్యాక్సిన్స్ అండ్ ఇమ్యునైజేషన్ ప్రాక్టీసెస్ (IAP ACVIP) సిఫార్సు చేయబడిన టీకా షెడ్యూల్‌ను ఖచ్చితంగా అనుసరించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పిం ది. ఇందులో నోటి ద్వారా పోలియో వ్యాక్సిన్ (OPV), 6, 10 మరియు 14 వారాలలో నిష్క్రియాత్మక పోలియో వ్యాక్సిన్ (IPV), 16-18 నెలలలో మరియు మళ్లీ 4-6 సంవత్సరాలలో బూస్టర్‌లు వేయించాలి.



**– డాక్టర్ నితిన్ చావ్లా,**
**పీడియాట్రిక్స్ చీఫ్,**
**కిమ్స్ హాస్పిటల్,**
**హైదరాబాద్.**

## ఈ వారం కథ

# క్యూ లైన్

అరగంట నుండీ క్యూ లోనే ఉన్నాం భార్యా భర్తలం.

నాకు కొంచెం ఓపిక ఎక్కువే కానీ ఆవిడ కు తక్కువే. అయినా ఈ సారి తన అసహనాన్ని అంతగా వ్యక్త పరచడం లేదు. అది ఈ వేళ కాని వేళ నాకు ఊరట. నిజానికి ఈ ప్రోగ్రాం నేను పెట్టిందే కాబట్టి ఇంకొంచెం ఆందోళన.. తను ఇబ్బంది కి కారణం నేనే కదా అని.

" క్యూ కదలడం స్లో అయినా, తోపులాట లేకపోవడం బాగుంది కదా!"

విచిత్రం గా చూసి తలాడించింది, అవునన్నట్టుగా.

ముందున్న వ్యక్తి కలగజేసుకుని " ఆడవాళ్లకు వేరే లైన్ ఉంటే బాగుణ్ణు, తొందరగా పూర్తి చేసుకుని ఎక్కడైన కొంచెం రిలాక్స్ అయ్యేవారు"అన్నాడు.

"అప్పుడు మనం తిరిగొచ్చి వీళ్ళను వెదుక్కునేసరికి సరిపోయేది"జోకేశాను.

ఆయన నవ్వి 'అది నిజమే లెండి. అయినా ఇంత స్లో గా కదలడం ఏమిటండీ ఈ లైన్. అక్కడకు చేరిన వాళ్ళు అంతా మరిచిపోయి అక్కడే ఉండిపోతున్నట్టున్నారు.' నిట్టూర్చాడు.

"ఏమోనండి.అదే తెలియడం లేదు. అక్కడికి వెళ్తే కానీ అర్థంకాదు.సరే.ఎలాగూ
వచ్చేసాం.ఎంతసేపైనా తప్పుతుందా?కానీయండి."

" అంటే కొంచెం పెద్ద వయసు వాళ్ళం కదండీ.ఎక్కువ నిలబడలేం. అట్టే వేచి ఉండలేం. తిండి వేళ కూడా దాటిపోతుంది.ఒంట్లో షుగర్ కూడా ఉంది" కష్టాలన్నీ ఏకరువు పెట్టాడాయన.


"అయ్యో.మరి వేరే దారి ఉందేమో చూడలేకపోయారా? వీఐపీ బ్రేక్ దర్శనం లాంటివి.పెద్ద వయసు కదా!"

"అలాంటివి ఏవీ లేవండి.రాజ్యాంగం ప్రసాదించిన సమానత్వం ఖచ్చితం గా పాటించ బడుతుంది ఇక్కడ." నవ్వాడాయన.

క్యూ లైన్ దగ్గరకు వచ్చింది.హమ్మయ్య అనుకున్నాను.ముందు మహా అయితే ఇరవై మంది ఉంటారు.

" ఇంకో పావుగంట లో మన వంతు వచ్చేస్తుంది.ఇక పర్వాలేదండీ.తిరిగి ఇంటికి వెళ్ళడానికి ఆటోలు దొరకవని బాధ లేదింకా." మా ఆవిడ ఆనందంగా చెప్పింది.

" అవునోయ్.ఒకటి గమనించావా! క్యూ లో ఎంత క్రమశిక్షణ



నడుస్తోందో?ఆ లాస్ట్ లో ఏం జరిగి లేట్ అవుతుందో కానీ మిగతాదంతా మిలట్రీ క్రమశిక్షణ.నో జంపింగ్.నో పుషింగ్."

" అందుకనే అండి. తిరుపతి దేవుడి క్యూ లైన్ లో వాలంటీర్లు ఉండి తొందర పెడుతుంటారు..లేకపోతే వెనకవచ్చిన వాళ్లని మర్చిపోయి అక్కడే ఎక్కువ సేపు ఉండిపోతారు.ఇక్కడ కూడా అలాంటి అరేంజిమెంట్ పెట్టాల్సింది."

మాటల్లోనే దగ్గరకు వచ్చేశాము.

' ఆయన ' కనబడ్డాడు.ఆనందంగా చెయ్యి ఊపాను.తిరిగి రెస్పాన్స్ అంతగా లేదు.క్షణ మాత్రం చూపు కలిపి, అంతే అభావంగా తన పనిలో నిమగ్నమయ్యాడు.నా మొహంలో మారిన రంగులు ఆవిడ గమనించింది.

" మిమ్మల్ని చూడలేదేమోనండి.ఆయన బిజీలో ఆయన ఉన్నట్టున్నాడు"

"అంతే అయ్యుంటుంది లే.లేకపోతే మన మీద కోపమా ఏమిటి?"సర్ది చెప్పుకున్నాను.

ఇక మా వంతు వచ్చింది.

' ఆయన ' చూసాడు.చిన్న పలకరింపు నవ్వు మర్యాద కి నవ్వాడు. ఆయన అంతగా పరిచయం లేని వ్యక్తి కూడా కాదు. చూసేవాళ్ళు మమ్మల్ని మంచి మిత్రులనుకుంటారు.ఈ రోజు పెళ్ళికొడుకు తండ్రి,మమ్మల్ని పెళ్లికి పిలిచింది ఆయనే.

నన్ను చూడగానే ఎంతో ఆనందం వ్యక్త పరుస్తాడనుకున్నాను.కొంచెం కౌగలించుకుని వచ్చినందుకు థాంక్స్ లుక్ ఇస్తాడనుకున్నాను. అదేం లేదు. వచ్చావా అన్నట్టు నవ్వు.ఎందుకొచ్చావ్ అన్నట్టు చూపు.

చేతిలో పూలరేకులు, అక్షతలు ఇచ్చి వధూవరుల్ని దీవించ మన్నాడు.ముందున్న పెద్దాయనా, మేమూ దీవించడానికి రెడీ అయ్యాం. వధూవరులు మాత్రం ఇంకా సిద్ధం కాలేదు.చక్కగా చిలకా గోరింకల్లా కబుర్లు,నవ్వుల్లో పడ్డారు.ఈలోగా ఫోటోగ్రాఫర్ ఆదేశాలతో పోజులివ్వడం లో మునిగిపోయారు.ఆ తంతు ఎటూ తేలడం లేదు.

' ఇక్కడ లేటు ఎందుకవుతోందో ఇప్పుడు అర్థమైంది' అన్నట్టు పెద్దాయన నన్ను చూసి నవ్వాడు. అవునన్నట్టు బదులుగా నవ్వాను.

వధూవరులు కుదురుకున్నాక వారి తలపై అక్షతలు వేసి ముందుకు కదిలాం.' అలా దీవించే అవకాశం రావడం మీ పూర్వ జన్మ సుకృతం ' అన్నట్టు వధూవరులు ఇరువురూ కనీసం కన్నెత్తి చూడలేదు. వాళ్ళలో వాళ్ళు మాట్లాడుకుంటూనే ఉన్నారు.

స్టేజి దిగాం.ముందున్న పెద్దాయన మరో పోరాటానికి సిద్ధమై బఫే భోజనాల వైపు కదిలాడు..అసలే షుగర్ పేషెంట్, ఆకలి తో పోరాడలేడు కదా. ఆయనకి ఆల్ ది బెస్ట్ చెప్పి మేం రోడ్డు వైపు కదిలాం.అక్కడ పోరాడడం కన్నా ఆకలితో పోరాడ్డమే మాకు ఈజీ. ఇంటికెళ్లి ఏదో కెతకొచ్చు..కొంచెం గౌరవంగా.

" ఇలా అవుతుందని అనుకోలేదు బంగారం.అలా అయితే ఒక్కడినే అటెండ్ అయ్యేవాడిని. నిన్నూ ఇబ్బంది పెట్టేవాణ్ణి కాదు" గిల్టీ గా ఆవిడతో అన్నాను.

" పెద్ద తేడా ఏముంది లెండి.అయినా ఒకే ఊర్లో ఉండి కూడా వాట్స్ అప్ లో పిలిచిన పేరంటానికి వెళ్తే ఇలానే ఉంటుంది. పిలుపు లోనే మర్యాద తెలిసిపోలేదా! కొత్తగా ఆశ్చర్య పోడానికి ఏముందని." తేలిగ్గా తీసిపడేసింది.

నేను తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాను.

**డా.డి.వి.జి. శంకరరావు,మాజీ ఎంపీ. హౌస్ నంబర్ 50,**
**కామాక్షినగర్, విజయనగరం,ఆంధ్ర ప్రదేశ్.535003.**

## సరికొత్త సీరియల్

# చాకిరేవు

(గతవారం తరువాయి)

‘ఎందుకు భయపడుతున్నావు? పిల్లలు వద్దా?’ వెకిలిగా, అసహ్యంగా, పిచ్చిగా, వెర్రిగా, కొవ్వుగా, మదపుటేనుగులా నవ్వాడు.

‘నీ చెల్లి లాంటి దాన్నయ్యా’ పెదవుల నుండి మాటలు వణుకుతూ బయటపడ్డాయి. అప్పటివరకు కొండారెడ్డి అటువంటి వాడనుకోలేదు. బయటకు పెద్ద మనిషిలా కనపడుతూ ఇంతటి నీచమైన బుద్ధిగలవాడా అని హడలిపోయింది.

‘ఛీ! నీయమ్మ, నువ్వు నా చెల్లి ఏందే? కులం తక్కువ దానా, ఎంత కొవ్వు పడితే అలా అంటావని పాపులమ్మ దగ్గరికి నడిచాడు.’

కులం తక్కువ స్త్రీ నుండి సుఖం కావాలి కానీ చెల్లిలా మాత్రం భావించలేక పోయాడు. నిచ్చెనమెట్ల సమాజాన్ని కూల్చాలి, అందరూ సమానమేనన్న చైతన్యం ప్రతి ఒక్కరిలో రావాలి. భయంతో, బీదరికంతో, సంస్కృతి పేరుతో, మూఢనమ్మకాలు, ఆచారాలతో తక్కువ కులంగా చెప్పబడుతున్న కులాల స్త్రీలను నమ్మించి, మోసం చేసి లోబరుచుకోవడం జరుగుతూనే ఉంది.

‘అయ్యా! నన్ను వదిలేయ్, నేను వెళ్లిపోతాను’ గదిలో నుండి పరిగెత్తే ప్రయత్నం చేసింది.

కోడిపిల్లను గ్రద్ద పట్టుకున్నట్టు, వల వేసి చేపను పట్టినట్టు, పక్షి రెక్కను తుపాకీ తూటాతో కాల్చినట్టు పాపులమ్మను పట్టుకున్నాడు. కొండారెడ్డి చెరలో నుండి తప్పించుకోడానికి గింజుకుంది, బతిమిలాడింది, వేడుకుంది.

కొండారెడ్డి సడలలేదు, ఇనుపకంచెల లాంటి చేతులతో గట్టిగా కౌగలించు కున్నాడు. ‘ఒక్క గంట సహకరిస్తే స్వర్గం చూపిస్తా’ నీచంగా, అమానుషంగా, నీతి లేకుండా కూశాడు.

పంజరంలో పక్షిలా విలవిలలాడుతూ కొండారెడ్డి నుండి తప్పించుకోడానికి ప్రయత్నించి విఫలమయ్యింది. ఊబిలో పడినట్టు, బతికుండగానే సమాధి చేసినట్టు, రక్తం గడ్డకట్టినట్టు, గాలి ఆగిపోయినట్టు, సమయం స్థభించిపోయి నట్టు అనిపించింది.

గుండెల మీద బాదుతూ, చేరులతో ముఖాన్ని రక్కింది. గట్టిగా కేకలు పెట్టడంతో మూతికి చేయి అడ్డుపెట్టాడు. చెంపల మీద చరుస్తూ పక్కనే ఉన్న సద్దిబట్టను నోట్లో కుక్కాడు. జుట్టు పట్టుకొని లాక్కుపోయి మంచం మీద కుదేశాడు, గది తలుపు వేశాడు.

కొండారెడ్డి భార్య కట్టుకొని వదిలేసినా చీరతో పాపులమ్మ కాళ్లు కట్టేయడానికి ప్రయత్నించాడు. అయ్యా.. అయ్యా వదిలేయమని ప్రాధేయపడింది, కాళ్లు పట్టుకుంటానని బతిమిలాడింది, కనికరించమని మొరపెట్టుకుంది.

మంచం మీద నుండి లేచే ప్రయత్నం చేస్తున్న సమయంలో పాపులమ్మ మీదకు పాము పాకినట్టు పాకాలని ప్రయత్నించాడు. అప్పటికే కొండారెడ్డి చొక్కాను విప్పి ఉన్నాడు. నల్లగా, బలంగా, రింగుల రింగుల జుట్టుతో ఎలుగుబంటిలా కనిపించాడు.

మృగం మీద పడుతున్నప్పుడు బతిమిలాడితే వదిలిపెట్టదని పాపులమ్మకు తెలుసు. మాన ప్రాణాల్ని కాపాడుకోడానికి కాళ్లతో కొండారెడ్డి బలమైన ఛాతి మీద తన్నింది. కొండారెడ్డి ఛాతి అదిరింది, గుండె బెదిరింది, శరీరం పదిరింది.

ఒక్కక్షణం పాటు ఏం జరుగుతోందో అర్థం చేసుకోలేక కనురెప్పలు ఆర్పకుండా పాపులమ్మ వైపే చూశాడు. పక్కనే పండ్ల మీదున్న కత్తి తీసుకొని కొండారెడ్డిని చంపడానికి శివంగిలా దూకింది. కొండారెడ్డి కన్నుల్లో ప్రాణభయం, వెన్నులో వణుకు.

పాపులమ్మ కొండారెడ్డి ముఖం మీద కాండ్రించి ఉమ్మింది. చీరను, జుట్టును సర్దుకొని గది నుండి వెళ్లిపోయింది. కొండారెడ్డి బతికున్న శవంలా మంచం మీద పడ్డాడు. కోపం, ఆవేశం, ఆక్రోశం, పాపులమ్మ అంతు చూడాలను కున్నాడు.

తక్కువ జాతిది కాబట్టి నోరు మూసుకుంటుంది, చెప్పినట్లు వింటుంది, తక్కువ జాతి వాళ్లకు మానం, మర్యాద ఉండవు, ఉండకూడదు అనుకున్నాడు. తిరగబడుతుందని, గుండెల మీద తంతుందని, రక్కుతుందని ఊహించలేక పోయాడు.

గుడిసె బయటే నెత్తి మీద నీరు కుమ్మరించుకొని, లోపలికి వెళ్లి బట్టలు మార్చుకుంది. జరిగిన విషయాన్ని ఎవరికీ చెప్పలేదు. పాపులమ్మే కాదు చాలామంది ఆడవాళ్లు తమకు జరుగుతున్న అన్యాయాలపై నోరు విప్పడం లేదు. నోరు విప్పాలి, పిడికిలి బిగించాలి, తప్పుడు వెధవల చెడ్డబుద్ధిని బహిర్గతం చేయాలి.

మంచం మీద నుండి కొండారెడ్డి లేవలేదు, లేవలేకపోయాడు. ఏడుపు రాలేదు, కక్ష పెంచుకున్నాడు. అప్పటివరకు నచ్చిన స్త్రీలని అనుభవించాడు. మొదటి సారి దెబ్బ తినడాన్ని తట్టుకోలేకపోయాడు. పైగా తక్కువ జాతి ఆడది గుండెల మీద తన్నిందని తలుచుకొని తలుచుకొని కుమిలిపోయాడు. ఎలాగైనా పాపులమ్మ అంతు చూడాలనుకున్నాడు.

ఆరోజు నుండి పాపులమ్మ సర్పంచ్ కొండారెడ్డి ఇంటికి వెళ్లలేదు. ఆదెన్నే కొండారెడ్డి ఇంటికి వెళ్లి బట్టలు తెచ్చేవాడు, ఉతికి ఇచ్చేవాడు. ఎందుకు వెళ్లలేదని పాపులమ్మను అడగలేదు.

***

ఆదెన్న, పాపులమ్మకు నిద్ర పట్టలేదు. తెల్లవారితే ఏం జరగబోతోందో ఊహించడానికి కూడా ధైర్యం చాలలేదు. రాత్రి అలానే స్థంభించిపోతే బాగుంటుందనుకుంది. గంగమ్మ తమ మీద ఎందుకు కక్ష కట్టిందోనని కుమిలిపోయింది.

ఇద్దరూ పడుకోలేదు, చిందరవందరగా పడున్న బట్టల మూటలను సర్దుకున్నారు. అంతలోనే పంచాయితీకి రావాలని పిలుపు వచ్చింది. సుబ్బక్క, పాపులమ్మ, ఆదెన్నతో పాటు గంగ కూడా పంచాయితీకి వెళ్లింది.

పాపులమ్మ వైపు కోపంగా చూసి కొండారెడ్డి మీసాలను దువ్వుకున్నాడు. స్వామి మెడలో జంజం, నుదుటి మీద నామాలు, ఒంటి మీద చొక్కా కాకుండా ఎర్రని వస్త్రా న్ని కప్పుకున్నాడు. స్వామికి దగ్గరలో ఎవరూ నిలబడటానికి వీళ్లేదు. స్వామి కోసం ప్రత్యేకంగా ఒక కుర్చీ ఏర్పాటు చేశారు.

దర్జాగా, అహంకారంగా, తానే దేవుడిలా భ్రమపడ్డాడు. పల్లె మొత్తం తన కనుసన్నుల్లో ఉండాలనే కోరిక, ఆశ స్వామిలో నిండుగా ఉన్నాయి. ఎవరైనా తన మాటకు విలువ ఇవ్వకపోతే దేవుడి పేరు చెప్పి భయపెడతాడు. బ్రాహ్మణుడికి గౌరవం, విలువ, మర్యాద ఇవ్వకపోతే మహా పాపమని కథలు కూస్తాడు.

కొండారెడ్డితో పాటు మరో నలుగురు పల్లె పెద్దలు అరుగు మీద తెల్లని బట్టలు వేసు కొని కూర్చున్నారు. ఆ బట్టలను ఉతికి, ఇస్త్రీ చేసింది కూడా ఆదెన్న, పాపులమ్మలే.

‘చెప్పండి స్వామి! పాపులమ్మ, ఆదెన్నల వల్ల మీకు కలిగిన నష్టం ఏమిటి?’ కొండారెడ్డి పెద్దరికం నటించాడు.

‘ఉతకడానికి ఎంతో విలువైన పట్టు వస్త్రాలను ఇస్తే నీటిలో కొట్టుకుపోయాయని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చాడు ఈ కులం తక్కువ వెధవ’ ఆదెన్న వైపు చూస్తూ పళ్ళు పటపటా కొరికాడు.

స్వామి బట్టలే కాదు మా అందరి బట్టలు కూడా మాయం చేసి కథలు చెప్తున్నాడని బాపనోళ్లు ఆరోపించారు. నా బట్టలు కూడా లేవన్నాడు కొండారెడ్డి.

‘ఏం రా బట్టలు ఏమయ్యాయి?’ ఆదెన్న వైపు కోపంగా, పాము కప్పను మింగినట్లు చూశాడు.

‘అయ్యా, ఇన్ని రోజుల నుండి పల్లెలో బట్టలు ఉతుకుతున్నాము. ఏ రోజైనా, ఎవరికైనా బట్టలు పొరపాటు చేశామా? వంకలో బట్టలు ఉతుకుతున్న సమయంలో నీళ్ళు వచ్చాయి. బతుకుతామో లేదో అనుకున్న సమయంలో గంగమ్మ తల్లి మాపై చల్లని చూపు ఉంచింది. మేము కావాలని అలా చేయలేదు, బట్టలను దాచలేదన్నాడు.’

‘ఎప్పటి సంగతో ఇప్పుడెందుకురా? మా బట్టలను మీ నిర్లక్ష్యం వల్ల పోగొట్టారు. దానికి నువ్వు, నీ కుటుంబం తగిన మూల్యం చల్లించాల్సిందేనని’ బాపనోళ్లు ముక్తకంఠంతో తీర్మానించారు.

‘ఇందులో మా తప్పేమీ లేదు, నీళ్లు వస్తాయని అనుకోలేదు. మీ కాళ్లు ముక్కుతా నాపై కనీకరించండని ప్రాధేయపడ్డాడు.’

‘కాళ్ల మీద పడితే నష్టం తీరదు కదరా?’ పెద్ద గొంతుతో దున్నపోతు రంకె వేసినట్లు అన్నాడు.

వాదులాట పెట్టుకోవడం ఇష్టంలేక ‘ఏం చేయమంటారో, ఏ శిక్ష వేస్తారో వేయండని తల దించుకొని నిలబడ్డాడు’ సుబ్బక్క, పాపులమ్మ ఒక్కమాట కూడా మాట్లాడలేదు.

తన తండ్రిని, కుటుంబాన్ని పల్లె మొత్తం తిట్టడాన్ని గంగ తట్టుకోలేకపోయింది. ఆదెన్నను చూసి వెక్కి వెక్కి ఏడ్చింది. నీళ్లు రావడం వల్లే బట్టలు పోయాయని, బట్టలు పోవడం వల్ల అందరూ తిడుతున్నారని బాధపడింది.

‘వీళ్లను పల్లె నుండి వెలేద్దామా? చింతమానుకు కట్టేసి చచ్చేవరకు కొరడాతో కొడదామా?’ కొండారెడ్డి స్వామిని అడిగాడు.

‘కొట్టడం, తిట్టడం, వేలేయడం వల్ల మనందరికీ కలిగిన నష్టం భర్తీ అవ్వదు.’

‘మరేం చేద్దామంటారు?’ స్వామి వైపు ఆలోచనగా చూశాడు.

‘వీడి నిర్లక్ష్యం వల్ల మనందరికీ నష్టం కలిగింది. ఇక నుండి పల్లెలో అందరి బట్టలను ఆదెన్న కుటుంబం జీవితాంతం ఉచితంగా ఉతకాలని కోరాడు.’

‘అయ్యా! పల్లెలో అందరి బట్టలు ఉచితంగా ఉతికితే మేమెలా బతకగలము? కాస్త కనికరించండని వేడుకున్నాడు.’

కొండారెడ్డి మాట్లాడుతూ ‘ఇక నుండి ఆదెన్న కుటుంబానికి బట్టలు ఉతికినందుకు ఎవరేగాని డబ్బు ఇవ్వకూడదు. కాకపోతే వాళ్లు కూడా బతికి బట్టకట్టాలి కాబట్టి పల్లెలో అందరూ బిచ్చం వేయచ్చు. అలా బిచ్చం ఎత్తుకొని బతకాల్సిందే.

మన ఇళ్లలో మిగిలిపోయిన సద్దన్నం, సద్ది కూరలు, పాత బట్టలు, ఇతర పనికిరాని వస్తువులు బిచ్చం వేయచ్చని తీర్పునిచ్చాడు. తీర్పు ఇచ్చే హక్కు, అధికారం అగ్ర కులాలకే ఎందుకుంది?



పల్లెలో గౌరవంగా, హుందాగా పని చేసుకుంటూ బతికే ఆదెన్న, పాపులమ్మను అడుక్కుతినేవారిని చేసి, వ్యక్తిగత గౌరవాన్ని హననం చేశారు. అవకాశం కోసం ఎదురుచూస్తున్న కొండారెడ్డికి బంగారం లాంటి అవకాశం వచ్చింది. వచ్చిన అవకాశాన్ని వదులుకోకుండా పాపులమ్మ మీద, పాపులమ్మ గౌరవం, బతుకు మీద తన్నాడు.

పని చేసుకొని బతికేవారు అడుక్కుతినాలని అనుకోరు. శ్రమను నమ్ముకున్న వాళ్లకు, శ్రమించేవాళ్లకు జీతం ఇవ్వాలే కానీ బిచ్చం వేయడం ఏమిటని ఎవరూ అడగలేకపోయారు, ఎవరి నోర్లూ తెరుచుకోలేదు. తెరుచుకుంటే ఆదెన్న, పాపులమ్మలకు పట్టిన గతే తమకూ పడుతుందని పల్లె ప్రజలకు తెలుసు. అందుకే మౌన సముద్రంలో కొట్టుకుపోయారు.

మౌనం మోగేవరకు ఇలాంటి దాడులు ఆగవు. మౌనాన్ని బద్దలు కొట్టే ప్రశ్న పుట్టుకు రావాలి. అలలు అలలుగా దళిత బహుజన తీరాన్ని తాకాలి.

భూమిలో నుండి మొక్క వచ్చినట్టు, మొక్క నుండి పూలు, చెట్టు నుండి పండ్లు కాసినట్టు, మేఘం నుండి వర్షం దూకినట్టు సహజంగా, అవసరంగా, ధీమాగా, ఖచ్చితంగా.

***

సాఫీగా సాగుతున్న పాపులమ్మ, ఆదెన్న బతుకుల్లో వంక నీళ్లు కన్నీళ్లలో కొట్టుకుపోయేలా చేశాయని బాధపడ్డారు. కన్నబిడ్డల్లా పెంచుకున్న గాడిదెలు నీటిలో కొట్టుకుపోవడం ఎవరూ జీర్ణించుకోలేకపోయారు. వంకకు వెళ్లాలంటే భయం, అలజడి.

వంక నీళ్లను పాపులమ్మ శత్రువును చూసినట్టు చూసింది. బట్టలు ఉతకడానికి సుబ్బక్క, గంగులు, ఆదెన్న మాత్రమే వంకకు వెళ్లేవారు. పల్లెలోని గుడిసెల నుండి సద్ది బట్టలు తీసుకురావడానికి ఆదెన్న వెళ్తే, ఉతికిన బట్టలు ఇచ్చేయడానికి పాపులమ్మ వెళ్ళేది.

ఆదెన్న అందరి ఇళ్ళ నుండి బట్టలను మూటలుగా కట్టుకొని వీపు మీద మోసుకొని గుడిసెకు మోస్తున్నాడు. ఆదెన్నకు గంగులు కూడా సహాయం చేస్తున్నాడు. అలా బట్టలను వీపుల మీద మోసే పని ఎక్కువగా వాళ్లు ఇద్దరే చేశారు.

బట్టలు ఉతికిన తర్వాత ఉతికిన బట్టలు ఇవ్వడానికి, బిచ్చం అడుక్కోడానికి ఆదెన్నను పాపులమ్మ పంపేది కాదు. భర్త ఎవరి దగ్గర చేయి చాచకూడదని, భర్త మర్యాదకు ఏమాత్రం భంగం కలగకూడదని. అందుకే ఉతికిన బట్టల మూటలను వీపు మీద మోస్తూ, అందరి ఇళ్లకు చేర్చేది. తనతో పాటు గంగకు కూడా చిన్న బట్టల మూటను మోయడం అలవాటు చేసింది. ముందులా గంగను ఆడుకోడానికి పంపడం లేదు, గంగ కూడా వెళ్లడానికి ఇష్టపడలేదు.

ఒకరోజు పాపులమ్మ, గంగ ఉతికిన బట్టలు ఇవ్వడానికి కొండారెడ్డి దగ్గరకు వెళ్లారు. నిజానికి ఆరోజు జరిగిన సంఘటన తర్వాత పాపులమ్మ ఎప్పుడూ కొండారెడ్డి ఇంటి గడప తొక్కలేదు. ఇంటి ముందు వరండాలో బట్టల మూట దింపి, చేతులు కట్టుకొని, తల దించుకొని మౌనంగా నిలబడింది.

‘ఏమే నీ మొగుడు రాకుండా నువ్వు వచ్చావేమి?’ పళ్ళు ఇకలించాడు.

కొండారెడ్డి వెకిలి నవ్వు, చీదర మాటలకు సమాధానం చెప్పకుండా ‘అయ్యా బిచ్చం’ అంటూ కొంగు చాచింది.

‘ఆరోజు కొంగు పక్కకు తొలగించి ఉంటే, ఇప్పుడిలా అడుక్కునే పరిస్థితి వచ్చేది కాదు కదా?’ కొవ్వుగా మాట్లాడాడు.

కొండారెడ్డి తన తల్లిని అవమానిస్తున్నాడని, హేళనగా, అమర్యాదగా మాట్లాడుతున్నాడన్న విషయం గంగ అర్థం చేసుకుంది. పరిగెత్తుకుంటూ బయటకు వెళ్లి పిడికిలితో మట్టి తీసుకొని కొండారెడ్డి మీద విసరడానికి ప్రయత్నించింది.

‘ఏమే? నీకు కూడా నీయమ్మ లాగా పొగరు, కొవ్వు ఎక్కువే’ అంటూ గంగ మెడ పట్టుకొని తోశాడు. కిందపడిన గంగను తీసుకొని మౌనంగా అక్కడి నుండి వెళ్లడానికి ముందుకు నడిచింది

(మిగతా వచ్చేవారం)



జాని తక్కెడశిల
7259511956

( 7వ పేజీ తరువాయి)

అక్కడ నుంచే ఈ ఉత్సవాలు ప్రారంభమయ్యాయని మరొక నానుడి ఉంది.

**సంతతిని పునరుత్పత్తి**

దీపావళి పండుగ నాటికి వ్యవసాయ పనుల్లో దున్నలు,గేదెలు, ఎద్దులు,ఆవులతో చేసే పని చివరి దశకు చేరుకుంటుంది.ఆ సమయంలో పశువులు సమృద్ధిగా మేతను తింటూ బలంగా తయారై తమ సంతతిని పునరుత్పత్తి చేసే దశకు చేరుకుంటాయి.మేలు జాతి జంతువులను ఉత్పత్తి చేసే క్రమంలో ఈ పండుగ పుట్టుకొచ్చింది.అప్పట్లో వందలు,వేలాదిగా తరలివచ్చే దున్నలన్నింటిలో మేలు రకమైన జాతిని ఎన్నుకుని ఆ దున్న రాజును,దాని యజమానిని ఘనంగా సత్కరించి,ఆ దున్న రాజును,గేదెలతో క్రాస్ చేయించి మేలు జాతి దూడలను ఉత్పత్తి చేసేవారు.ఈ విధంగానే ఆంధ్ర ప్రాంతంలో కాటమరాజు ఒంగోలు గిత్త అనే బ్రీడును, కృష్ణా పరివాహక ప్రాంతాలలో మల్లన్న, బీరప్పలు మేలిమిజాతి దక్కనీ గొర్రెలను వృద్ధి చేశారు. ఈ ఒంగోలు గిత్తలు మరియు దక్కనీ గొర్రెలు ప్రపంచంలోనే పేరు ప్రతిష్టతలు పొందాయి.

**1946 నుంచి**

ఆధునిక సదర్ ఉత్సవాలు మాత్రం 1946 నుంచి స్వర్గీయ శ్రీ చౌదరి మల్లయ్య యాదవ్ గారు నారాయణ గూడ వై,ఎమ్,సి లో ప్రారంభించినట్లు తెలుస్తోంది. కాలక్రమేణా హైదరాబాద్‌లోని అనేక ఇతర ప్రాంతాలలో నిర్వహిస్తున్నప్పటికీ,నారాయణగూడ వై,ఎమ్,సి సదర్ ఉత్సవం (రెడ్డి మహిళా కళాశాల సమీపంలో)దాని చరిత్ర మరియు ప్రజాదరణ కారణంగా అత్యధిక మందిని ఆకర్షిస్తుంది.అందుకే దీనిని పెద్ద సదర్ అంటారు. నారాయణగూడ వై,ఎమ్,సి సదర్ 1946 నుండి నేటి వరకు దాని వ్యవస్థాపకుడు స్వర్గీయ శ్రీ చౌదరి మల్లయ్య యాదవ్,తరువాత అతని కుటుంబ సభ్యులచే ఏటా నిరంతరాయంగా నిర్వహించబడుతుంది..


ఈ ఉత్సవం ప్రధానంగా నారాయణ గూడ తో పాటు షేక్పేట్-దర్గా,సైదాబాద్,ఖైరతాబాద్, అమీర్పేట్,కార్వాన్, బేగంబజార్, ముషిరాబాద్,గోశామహల్,మల్కాజ్ గిరి లాంటి వివిధ ప్రాంతాల్లో జరుపుతారు.

నేడు ఈ ఉత్సవాలు రాష్ట్ర వ్యాప్తంగా శంషాబాద్, షాద్నగర్,కొల్లాపూర్,తుక్రాన్,నాగార్జున సాగర్, నకిరేకల్,మహబూబ్నగర్, జడ్చర్ల,అచ్చంపేట,కల్వకుర్తి, కరీంనగర్, చేవెళ్ల,నల్గొండ, భువనగిరి,యాదగిరి గుట్ట లాంటి నగరాలతో పాటు,మండల కేంద్రాల వరకూ విస్తరించాయి.

**ఇతర రాష్ట్రాలలోనూ..**

ఇది కేవలం తెలంగాణలోనే కాక మహారాష్ట్ర,మధ్యప్రదేశ్ లలో పోలా అని, తమిళనాడులో జల్లికట్టు అని, కర్ణాటక లో కంబాలని,నేపాల్లో మాళ్వి అని హర్యానా,ఆంధ్రప్రదేశ్ మొదలైన ప్రాంతాలలో కూడా వివిధ కాలాల్లో వివిధ పేర్లతో యాదవులు ఘనంగా జరుపుకుంటారు.యాదవుల ఐక్యతను,జంతువుల పట్ల వారికున్న ప్రేమానురాగాలను,వారి జీవన విధానానికి ఋతువులకు ఉన్న సంబంధాన్ని ఈ సదర్ ఉత్సవాలు సూచిస్తాయి.







**లక్ష్మీ పూజలాంటిది**

సాధారణంగా దీపావళి రోజు వ్యాపార వర్గాలు లక్ష్మీ పూజ నిర్వహిస్తారు. కానీ యాదవులకు ఈ సదరు ఉత్సవమే లక్ష్మీ పూజలాంటిది. ఎందుకంటే వారిది ఎక్కువగా పాల వ్యాపారం. గేదెలు, దున్నపోతులు, ఎద్దులు,ఆవులు, గొర్రెలే వారికి సంపద. కాబట్టి అవే వారికి లక్ష్మీ దేవతలు.అందుకనే ప్రత్యేకించి సదరు ఉత్సవం రోజున వాటికి శుభ్రంగా స్నానం చేయించి, పూలదండలతో అందంగా అలంకరంచి పండుగలా జరుపుకుంటారు.ఉత్తర భారతదేశంలో ఉన్న గోవర్ధన పూజ వలే మన దగ్గర సదర్ ఉత్సవం జరుపుకుంటారు.

**కవాతులో యాదవులు**

ఆవు పేడతో నేలపై అలికి, దానిపై రంగు రంగుల ముగ్గులు వేసి,తీపి పదార్థముతో అన్నం వండిన మట్టి కుండపై ద్వీపం వెలిగించి పూజ చేస్తారు.అనంతరం ఊరేగింపుకు తెచ్చిన బలిష్టమైన దున్నను దాని పైనుంచి దాటిస్తారు,దీనితో సదరు ఊరేగింపు ప్రారంభమైనట్లు.కవాతులో యాదవులు తమ అత్యుత్తమ దున్నలను ప్రదర్శించడానికి ఈ అవకాశాన్ని ఉపయోగించుకుంటారు.దున్నల శరీరాన్ని నూనెతో రుద్ది,వాటి కొమ్ములకు రంగురంగుల రంగులు వేయడం,మెడ చుట్టూ దండలు,పాదాలకు చీలమండలు (గజ్జలు),మెడ లేదా నుదుటిపై గంటలతో,వాటి కొమ్ములపై నెమలి ఈకలతో అలంకరిస్తారు.వివిధ ప్రాంతాల నుంచి డప్పుల శబ్దాలతో డాన్సులతో దున్న రాజులు బయలుదేరి తన చురుకుదనాన్ని,బలిష్టతను ప్రదర్శిస్తాయి.వాటిని ప్రధానంగా దాని వెనుక కాళ్లపై నిలబడేలా చేస్తారు. అందులో భాగంగా ఏ దున్నపోతైతే ఎక్కువ ఎత్తుకు తన ముందుకాళ్ళను లేపుతుందో ఆ దున్నపోతుకు బహుమతి ప్రదానం చేస్తారు.

**యాదవ్ ట్యూన్**

డాన్-కీ ట్యూన్ అని పిలువబడే కవాతులో యాదవులు ప్రత్యేకమైన రాగం వాయిస్తారు.ఈ ట్యూన్ చాలా ప్రత్యేకమైనది.దీనిని యాదవ్ ట్యూన్ అని పిలుస్తారు.ఈ సంగీతం యాదవ పురుషులు ప్రదర్శించే ప్రత్యేక స్టెప్స్ డ్యాన్స్‌తో కూడి ఉంటుంది. ఈ డ్యాన్స్‌లో పురుషులు ఒక చేతిలో హాకీ స్టిక్స్ పట్టుకుని ఒక వృత్తంలో ముందుకు,వెనుకకు కదులుతూ పెద్ద పెద్ద అడుగులు వేస్తూ చుట్టూ తిరుగుతారు.ఈ నృత్యాన్ని 'పెద పులి ఆట' అని అంటారు.అంటే పురుషులు పులి యొక్క నడక మరియు కదలికలను అనుకరిస్తున్నట్లు కనిపిస్తుంది.ఈ నృత్యాన్ని యాదవ నృత్యం అని కూడా పిలుస్తారు .

**రాజకీయ రంగు**

ఈ మధ్య జరుగుతున్నా సదర్ ఉత్సవాలు రాజకీయ రంగును పులుముకున్నట్లు , కులాలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం యాదవుల మధ్య చీలికలు తెచ్చి వారి సాంస్కృతిక పండుగలను సైతం రాజకీయ రొచ్చులోకి లాగడం విస్మయాన్ని కలిగిస్తుంది. యాదవులంతా ఒక్కటిగా రాజకీయాలకు అతీతంగా జాతి ఔన్నత్యాన్ని ద్విగినీకృతం చేసే విధంగా సదరు ఉత్సవాలు జరుపుకోవాలి.తెలంగాణ సాంస్కృతి,సాంప్రదాయాలు భవిష్యత్ తరాలకు అందించాలి.

జుర్రు నారాయణ యాదవ్
9494019270

ఆనకు తడుస్తమని గుడిసెలు ఆకులుగప్పుకునే కాలం.. ఆగులు గాజులబేరమాడే కాలం..శెర్లశాపలు ఇళ్ళిల్లకుసుట్టిరికెంగలిపెకాలం ఉత్తర బాజురోడ్డుకాడ మల్లేశ్ మనసుదోశిందిసుకన్య. కాలేజిల ఇంటర్ సదివేందుకు రోజు టవునుకు బోయెటందుకు గా సోటుకొస్తదామె..ఆమె ఒక్కతేగాదు గాఊళ్ళెవులు బస్సో,ఆటో,జీబో ఎక్కాల్నన్నా.. గాసోటుకే రావాల. ఊరికి దచ్చినంబాజున ఇంగొకరోడ్డుంది. రైలుదిగచ్చేటోళ్ళు ఆనంగొస్తరు..గా శిన్నటేసన్ల పగులొక రొండు ప్యాసింజర్లు, ఒకటోరొండో గూడ్సులు రేత్రొక ప్యాసింజర్ మాత్రమే ఆగుతయ్. గనుక గారోడ్డు అంత సందడిగుండదు. ఉత్తరంబాజురోడ్డు అట్లగాదు. నాలుగూళ్ళకు పోయేటి దారిగాబట్టి అచ్చెటోళ్ళూ పోయెటోళ్ళతో సందడిగుంటది. ఆడ సోడాలోళ్ళూ, అరటిపళ్ళోల్లు, మొక్కజొన్న కంకులోళ్ళు, పాన్ దుకనోళ్ళ సందడుంటది. టీ ఓటళ్లకెల్లి టేప్ రికాడ్ పాటలుంటయ్.

సుకన్య తనఊరినుంచి ఒకదారిన, మల్లేశ్ తన ఊరినుంచి ఇంగొకదారిన గా సోటుశేరతరు.. ఆసోటుకొచ్చేటాల్కె ఇద్దరిఊళ్ళదార్లు వి షేప్ లో ఉంటయి. రొండుదార్లకు ఇద్దరుచీలినా చాలాసేపు గాపొలాలమీదికెళ్ళి సూసుకుంటనేపోతరు. రొండూ మట్టిదార్లేగానీ సుక్కమ్మొచ్చెదారి సక్కంగుంటది. బాటకు రొండేపుల ఎరుపు,పసుపు గుల్మొహార్ శెట్లుంటయ్.ఆనాకాలం మొదట్ల గవి ఇరగబూసి భలే అందంగుంటయ్.గాదారంతా పూలరెక్కలురాలి మట్టికానరాక ఎరుపుపసుపు రంగులుంటాయ్..

మల్లేశ్ జాను జిగ్రీ దోస్తులు ఇద్దరిదీ ఒకే కాల్నీ.నిజానికి జాన్ అని బైబిల్ పేరు పెట్టిన్లు ఆళ్ళ ఇంటోళ్ళు. కానీకాల్నీల జాను జాను అనుట్లగదే నడుస్తాంది. ఆడు పదిపెయిలై టవున్ల సుతారి పనిజేస్తండు మల్లేశ్ ఇంటర్ సదువు మద్దెలాపి టవున్ల మెకనిక్ షెడ్ల పని నేర్సుకుంటండు. ఎప్పటికైన అనఫిషియల్ ఇంజనీర్నైతనని అంటుంటడు. సుకన్య రామచంద్రాపురం పెద్దదొర మనుమరాలు.

రోజూ తనఊరినుండి స్నేహితురాళ్ళతో కలిసి నడిసొచ్చేసుకన్య అక్కడికి రాంగనే గా గుల్మొహర్లను జూశి మస్తు ఖుష్ అయితుంటది. గాపూలను తనివితీర జూసుడు ఆమెకెంతో ఇష్టం. గట్ల పూలనేజూస్తన్నప్పుడు కన్నార్పకుండా గామెనే జూస్తన్న మల్లేశ్ ను గమనించింది. మొదట్లో సూశినా పట్టించుకోక పోయేడిది. గా తర్వాత సూశీ సూడనట్టుండేడిది. ఒకనాడు ఎర్ర గుల్మొహర్ గుత్తి తెంపుదమని ప్రయత్నిస్తోంది. కాళ్ళబొటనేళ్ళమీద నిల్సొని అందుకోబోతన్నా అందీ అందకుండబోతన్నయ్ ఎగిరి అందుకుందమంటే ఆడపిల్ల సిగ్గడ్డమొస్తంది. 'ఇయ్యాళ ఎట్లైన నాకోసంఎర్రపూలు తేవే' అని కాలేజీల స్నేహితురాలు రోజూ అడుగుతుండటంతో ఆ ప్రయత్నంజేస్తాంది. దూరంకెల్లి బస్సొస్తా కనపడటంతో అప్పటిసంది ఆమె ప్రయత్నాన్ని జూస్తున్న మల్లేశ్ ఆమెదగ్గరికి పోయి చటుక్కున కొమ్మొంచి ఆమె చేతికందించి వెనక్కొచ్చిండు. అతనొచ్చి కొమ్మ అందించటం సంతోషమే అయినా సిగ్గుపడింది, ఏదోగుర్తొచ్చి భయపడింది. దాంతో అతనికి థాంక్స్ చెప్పలేకపోయింది.

సీట్ దొరక్కపోవుట్ల కండక్టర్ సీటుసమీపంలో నిల్చుందిసుకన్య. మల్లేష్, జాను ఇంకొందరు ఫుట్ బోర్డ్ మెట్లపై ఉన్నారు.ఎప్పటినుంచో తనకు తెలియకుండానే మల్లేష్ వైపు చూస్తోంది సుకన్య కొంతసేపటి తరువాత అతను ఇటు తిరగంగనే ఇద్దరికళ్ళు కలిశినయ్. ఆమె కండ్లల్ల థాంక్స్ అనే భావం కనవడ్డది.

తరువాతిరోజు బస్సు అంతేరద్దీగఉన్నది. సుకన్యకు సీటుదొరికింది, మల్లేశ్ సీటు దొరికే మోకాఉన్నా లోపటికిబోకుండా ఫుట్ బోర్డు కడ్డీపట్టుకొని యాళాడుతున్నడు. పక్కనే కూసున్న స్నేహితురాలు ఏమో మాట్లాడుతాంది. సుకన్య నోట్ బొక్కుతెరిసినట్టు తెరిసింది గానీ ఆమె-సూపు మల్లేశుపైనున్నది. టవునొచ్చినంక మల్లేశ్ ఎప్పటిలా రొండోస్టాపులనే దిగిపోయిండు. సూసీ సూడనట్టెబోతన్న అతన్నే సూస్తోంది సుకన్య బస్సుకదిలి ముందుకుబోతోంది కానీ సుకన్య మనసు ఆడనే దిగిపోయింది.

గారాత్రి వర్షమొచ్చింది తెల్లారి పొద్దుగాల దార్లన్నీ బురదమయం అయ్యాయి..రోజు లాగే స్నేహితురాలితో కలిసి వస్తోంది సుకన్య. స్నేహితురాలు ఏం జోక్ చేసిందో ఏమో ఆమెను అదిలించబోయి ఒక్కసారిగా పట్టు తప్పింది. కిందపడిపోతూ కుడిచేతిని నేలపై మోపి మొత్తం కింద పడబోయే ప్రమాదం తప్పించుకుంది .కానీ అరచేతికి బురదంటింది.. కడుక్కునేందుకు అక్కడున్న చేతిపంపు కొట్టేందుకు ప్రయత్నించినా అది చెడిపోయి ఉండటంతో నీళ్ళు రాలేదు. రోడ్డుదాటి హొటల్ లోకి వెళ్దామనుకుంటుండగా మల్లేశ్ తన బ్యాగ్ లోని వాటర్ బాటిల్ తీసిఆమెకిచ్చిండు..ఏమీ ఆలోచించకుండా ఆనీళ్లతో చెయ్యి కడుక్కొని బాటిల్ అతనికందించింది సుకన్య. బాటిల్ అందిస్తూ 'డబుల్ థ్యాంక్స్' అంది మెల్లగా ఆనికే ఇనపడేటట్టు ముఖంల

# గుల్ మొహర్..



భావంమారకుండా జాగ్రత్త పడుతూ. డబుల్ 'థ్యాంక్సా గదేంది 'అన్నాడతను. 'మొన్న కొమ్మ అందించినందుకు గిప్పుడేమో నీళ్లందిం చినందుకు ' అంటూ బస్ వైపు కదిలింది.

బస్ కదిలింది ఎప్పటితీర్నే గామెసీట్లో, అతను ఫుట్ బోర్డ్ మీద ఉన్నరు..సీట్లోంచి మల్లేశ్ వైపు చూసేప్రయత్నం చేస్తోందిసుకన్య, ఆమెకళ్ళకు జాన్ అడ్డొస్తున్నాడు అయినా సరే జాన్ తలమీదికెల్లి, పక్కకెల్లి మల్లేశు వైపు సూపులు సారిస్తోంది. మల్లేశ్ కూడా అడ్డంగా వేళాడుతున్న జాన్ చెవులమీదికెల్లి, అతనుపెట్టుకున్న టోపీమీదికెల్లి ఆమెతో చూపులుకలిపే యత్నం జేస్తుండు..వీళ్ళనుచూసి మురిసిపోతూనే బస్సు రయ్ మంటోంది.

గాతెల్లారి సుకన్య స్నేయితులతో గలిసొచ్చిందాడికి గాని బస్సచ్చె టైమైతన్నా మల్లేశ్ జాడలేకపాయె..టిపినిక్యారేజి బట్టుకొని జానొచ్చిండుగాని మల్లేశ్ రానేలేదు..'అస్తడా రాడా బస్సెక్కాల్నా అద్దా ' అనుకుంట ఎదురుసూస్తాంది సుకన్య. 'ఎందుకు రాకపాయెనో అటెంకొస్తడో తెలుసుకుందాం 'అన్నా ఎవుళ్ళనన్నా అడుగుదమన్నా ఏమనుకుంటరోనని భయం..'మల్లేశ్ అస్తడా' గీమాట జానును అడుగుదమని ఎన్ని మాట్లో నోటిదాంకొచ్చి ఆగిపోయింది. ఇంతల బస్సు రయ్యిన రానే అచ్చింది. ఎనక్కెనిక్కిజూస్తనే బస్సెక్కింది సుకన్య. కాలేజుకి బోయినంక గూడా ఆమెకు ఆడ ఉండబుద్ధైతలేదు ఏం తోస్తలేదు, బస్టాప్ కాడికేబోయి నిలబడబుద్ధైతాంది. సాయంత్రం అచ్చేటప్పుడు గూడ మల్లేశ్ యాడ్నన్న కనపడితే బాగుండని అనుకుంది గాని యాడ కనపడలే..గా రోజట్ల గడిశిపోయింది.

తెల్లారి నిదరలేస్తనే మల్లేశ్ ఆలోచనలు గామెను సుట్టుముట్టినయ్.. ఇయ్యాల కనపడినా పట్టించుకోగూడదని సూసినా సూడనట్టుండాలని విరహ వేదన అతనికీ ఎరకజేయాలనుకున్నది. తయారై బస్టాపొచ్చింది. ఆపాటికి మల్లేశ్ అచ్చేఉంటడని అనుకుంది. తలొంచుకోనొస్తంది కొన్ని నిమిషాలైనంక కొంచెం కొంచెం తలెత్తిసూసింది. మల్లేశ్ గానొత్తలేడు ఇయ్యాలగూడ రాలేదా అనుకునేపాటికి ఆమెపాణం ఉస్సూరంది. అస్తడేమోనన్న ఆశతో వాళ్ల ఊరిదారికెల్లి సూస్తాంది. గామె స్నేయితులు ఏమో మాట్లాడుకుంటన్రు, మద్దెమాద్దెలో సుకన్యకేదో చెపుతున్నా ..గామేం ఇనిపించుకుంటలేదు. జాను సెల్ఫోన్ మాట్లాడుతుండు. ఇంతల బస్సొచ్చింది.అందరు సీట్లు దొరకయేమోనని గబగబ ఎక్కుతున్రు. మల్లేశ్ రాకపోటలికె సుకన్యకు బస్సెక్కబుద్ధైతలేదు. ఫుట్బోర్డు మీదకాలుబెట్టి లోపలికిపోబోతున్న ఎంకటలచ్చిమిని శేయిబట్టాపింది. వెళ్ళొద్దన్నట్టుగ తల ఊపింది. ఆమెకేమో అర్ధమైనట్టుగా తనముందున్న జాను సొక్కాని ఎనకనుండి కాలర్ బట్టి లాగింది. ఏంటన్నట్టు జాను సూడగానే పోవొద్దన్నట్టు ఆమెగూడ తలూపింది. అట్లా ఆముగ్గురు ఎక్కకుండానే బస్సెళ్ళిపోయింది.

మరుసటి దినం బస్టాప్ కాడికి మల్లేష్ జానుతో కలిసచ్చిండు గానీ సుకన్యరాలే ఆమె దోస్తులు రాలే..బస్సొచ్చిందిగాని అదిగూడ కాలి కాలీగుంది.'రోజు కిక్కిరిసే బస్సు ఇయ్యాళెందుకు గిట్లుందీ అని కండక్టర్నడిగిండు మల్లేశ్. 'పరీక్షలైపాయెగద కాలేజోల్లు బంద్ ఇంగ రొండునెలల దనక గింతే' అనుకుంట టిక్కెట్లు గొడతండు. నాలుగు రోజులు అట్లనే అయినంక ఎందుకో గాబస్సెక్కుడు టవునుకు బోవుడు చికాకు అనిపిస్తాంది మల్లేష్కి సుకన్య కనపడ్కపోయేటాల్కి పిచ్చెక్కినట్లైతంది. సుకన్యకు బర్డే గిఫ్ట్ కొనేందుకు టవున్ లో రేత్రిపగులూ పనిజేశిండు మల్లేష్..ఆవిషయం జానుకుకూడా చెప్పలేదు.

అయితారం ఇళ్ళదగ్గర్నే ఉన్నరిద్దరు..'రేయ్ బండితీయ్' అన్నడు మల్లేశ్ జానుతో 'పిట్రోల్ లేదుమామ' అన్నడు జాను 'నీయబ్బ బండిగొంటరు గని పిట్రోల్ గొనలేవురా' అసహనంగ అన్నడు మల్లేశ్ 'బండి అప్పుమీది స్తరు మామ పెట్రోల్ గట్లగాదు' అనుకుంట పళ్ళికిలిచ్చిండు జాన్.' సరెనేను పోయిస్తతియ్ 'అనంగనే కొట్టంల పెట్టిన బండిని సటుక్కున ఏసుకొచ్చిండు జాన్.'ఏడికి బోవాలెమామ' అనంగనే 'శెంద్రాపురం బోనీయ్' అన్నడు.

జాను బండినడుపుతన్నడు సగందూరం బోయినంక.. 'గావూరెందుకురా' అని అడుగుతుంటే 'సుకన్యని సూడకుండ ఉండలేకపోతన్న రా.. నేను గామెను ప్రేమిస్తన్న నా మనసులోమాట జెప్పాల్నని ఇగో గీ లవ్ లెటర్ రాశినా ఇది ఎట్లన్న ఆమెకు ఇచ్చొద్దాం' అనగానే.. జానూ మాట్లాడుతూ 'పెద్దోళ్ళ పిల్లకు ప్రేమలేఖ రాయనీకి జేబులపెన్నో పెన్నులోఇంకో ఉంటె సాలదిరా.. కులం ఆళ్ళకుసమానమో ఎక్కువోఉండాల, ఎక్వ కులానికి గిట్ల తక్కువ కులాంతర ప్రేమలేకలు సెల్లవురా మల్లేశా'..అని ఎచ్చరించిండు జాను. స్నేయితుడు అట్లనుడు నచ్చలేదు మల్లేష్ కి.. 'ఎక్వ కులం, తక్వ కులమని మనమే మనల్ని లోకువ జేసుకునుడేందిరా...ఆళ్ళదో కులం మనదో కులం బస్ గంతే...సరె నువ్వన్నట్టు మనతాన కులంలేదే అనుకుందం అయితేందిరా ఇగో గీ అచ్చరాలనిండ గామెపైప్రేమే ఉంది ' అని కొట్టిపారేసిండు. దానికి జాన్ మాట్లాడుతూ 'రద్దైన నోటుమీద గూడ గవర్నర్ సంతకం సుద్దాగ గయ్యే అంకెలు, అచ్చరాలు, పెతిజ్ఞలుంటయ్ రా.. కానీ సెల్లుబాటవుద్దా.. దాసుకుంటె గ్యాపకమవుద్ది.. గంతె' నిట్టూరుస్తూ అన్నడు జాను. అర్దం కానట్టు సూశిండు మల్లేష్.

దొరోళ్ళకి ఎరకైతే బొక్కలిరగ్గొడతరు.. గీలెటర్ని ఎట్లరా ఆమెకిచ్చుడు అని అంటుంటె ఉన్నదిగదరా గా ఎంకటలచ్చిమి దానికిచ్చిపంపుదం అన్నాడు.. ఊరికడ పొలాల దగ్గర శెట్టునీడకి బండాపిండు జాన్.

ఇంతల 'ఓయ్' అన్నపిలుపు వినపడటంతో అటువైపు చూశారిద్దరు.. ఎంకట లచ్చిమి బర్లుదోలుకొని పొలం బోతాందనుకుంట.. సెలవుల్లో ఇంటికాడుంటానేమో కొంచెం ఒళ్ళుచేసింది. ఏందిట్లచ్చిళ్ళు..అనగానే అసలు విషయం చెప్పారు.. అది విని 'ప్రేమంటే ఏందో ఎరకేనా ' అని అడిగింది. ఎంకట లచ్చిమి అట్లా అటాత్తుగ అడిగేతాల్కె ఏం జెప్పాల్నో అంతుబట్టలే మల్లేశ్కి ఏం జెప్పల్నన్నట్టుగ జాను మొకంకెల్లి జూశిండు.. ఎంకట లచ్చిమే మళ్ళా నోరిప్పింది..'ప్రేమంటే నచ్చిన వ్యక్తి మంచిగ ఉండాలని కోరుకొనుడు 'ఎంకటలచ్చిమి చెపుతోంది ఆమె జెప్పేదేందో అర్దం కావట్లేదు మల్లేశ్కి 'నువ్వు గా బస్టాపుకిరానిరోజు జానును తీసుకొని వాళ్ళమామిడి తోటకిబోయినం..ఆడ నీగురించి ఒకేఒక్కవివరం అడిగింది ' అని చెపుతాంటె. 'గట్లనా ఏంది గా ఒక్క ఇవరం' అని అడిగాడు మల్లేష్. 'నీకులం ఏందో అడిగి తెలుసుకుంది. గది తెలిశినంకనే ఆమె అప్పడి దాంక వొద్దు వొద్దంటన్న గాపెళ్లికొప్పుకుంది ' అని చెప్పింది.

' నీగురించి అడిగినట్టుగానీ, కులం గురించి ఆరా తీశినట్టుగానీ నీతో అనొద్దని మాట దీసుకుందిరా అందుకనే ఆరోజు ఆమెతోగలిశి వాళ్ళ మామిడితోటకు పోయిన ఇషయం నీతోజెప్పలేదు ' అన్నాడు జాను. ' ఆమె ఎప్పుడూ నీతో ఒక్కమాటకూడా మాట్లాడలేదు కానీ ఆమె ఫస్ట్ క్రష్ కు గురయ్యింది. అందుకే నువ్వు బస్టాప్ కి ఆ రొండు రోజులురాకుంటే చానా బాధపడింది. కానీ నువ్వెవరో పూర్తిగా తెలుసుకున్నాక ఆమెలో సహజంగా ఉన్న కులప్రేమ బలపడింది..అది తనక్రష్ ని తొక్కేసింది. అందుకే మరో ఆలోచన లేకుండా మనసు మార్సుకుంది' అని వెంకటలక్ష్మి చెబుతుంటే. అదేమీ వినిపించుకోకుండా తనే బండిస్టార్ట్ చేసిండు మల్లేష్.

'నువ్వచ్చిపోయె తొవ్వల కుడిఎడమల ఎరుపు పసుపు గుల్మొహార్ శెట్లు.. నిజంగ అయి నీకోసమే పుట్టినట్టనిపిస్తది.ఆన కురిసినరోజు గాశెట్లు అందంల నీతోని పోటీపడ్తన్నాయా అనిపిస్తది.. సుక్కురారం కుంకుడు కాయలతో తలకుబోసుకొని నువ్వు లంగా ఓణీల అస్తంటవ్ సూడు.. అదిజూశి గవి అందంనేర్శినయ్.. నువ్వు నడిశొస్తన్నప్పుడు నీమీద గాశెట్ల ఎరుపురెక్కలు, పసుపురెక్కలు నీదారంత గవ్వేరంగులు ఎటో సూస్తున్నట్టునటిస్తా నువ్వు నన్నేసూస్తున్నప్పుడు, నవ్వినప్పుడు మరింత బాగుంటవ్ సుక్కా..నువ్వెప్పుడూ నవ్వుతుండాల ఇది నాకోరిక. ప్రేమంటే ఇదే గదా '.. ఇందాక మల్లేష్ ఇచ్చిన లవ్ లెటర్ ని గట్టిగా చదువుతున్నడు జాన్... ఎర్రదుమ్ము రేగుతోంది, బండి వేగంగా పరుగెత్తుతోంది. గుల్మొహార్ పూలు రాలుతున్నాయ్..పొలాలు, చెట్లు, కిలోమీటర్ రాళ్లు వింటున్నయ్..

**కంచర్లశ్రీనివాస్...9640311380**

కన్నడ హీరో శ్రీ మురళి హీరోగా, ప్రశాంత్ నీల్ కథ అందించిన భారీ యాక్షన్ మూవీ 'బఘీర'. హొంబలే ఫిల్మ్స్ ఈ సినిమాను ఖర్చుకు వెనకాడకుండా నిర్మించింది. హ్యాపెనింగ్ హీరోయిన్ రుక్మిణి వసంత్ శ్రీ మురళి సరసన నటించారు. ఈ సినిమా ట్రైలర్‌ను కూడా వయొ-లెంట్ యాక్షన్‌తో నింపేశారు. ఇంతకీ ఈ సినిమా ఎలా ఉంది?



కథ:

చిన్నప్పుడు తల్లి చెప్పిన కథలు విని జనాలకు మంచి చేయాలని పోలీస్ అవుతాడు వేదాంత్ (శ్రీమురళి). అతని తండ్రి (అచ్యుత్ ప్రసాద్) కూడా పోలీసే. కర్ణాటకలోని మంగుళూరులో ఛార్జ్ తీసుకున్న వెంటనే క్రిమినల్స్‌ను ఏరి పారేయడం మొదలు పెడతాడు. దీంతో పై అధికారులు అతన్ని పిలిచి ఎక్కువ దూకుడుగా వెళ్లవద్దని బెదిరిస్తారు. తనకు సొంతూరులో పోస్టింగ్ రావడానికి కూడా తండ్రి రూ.50 లక్షలు లంచం ఇచ్చినట్లు తెలుస్తుంది. దీంతో వేదాంత్ కుంగిపోతాడు. ఊళ్లో జరిగే నేరాలను పట్టించుకోవడం మానేస్తాడు.కానీ కొందరు రౌడీలు అత్యాచారం చేసిన ఒక అమ్మాయి వేదాంత్ స్టేషన్ ముందు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడుతుంది. దీంతో వేదాంత్ కొత్త బాట పడతాడు. సిటీలో ఉండే రౌడీలు, గూండాలు అందరి దగ్గరా లంచాలు తీసుకుంటూ డిపార్ట్‌మెంట్‌లో తనను తాను కరప్ట్ ఆఫీసర్‌లా ప్రచారం చేసుకుంటాడు. అదే క్రిమినల్స్‌ని రాత్రి పూట 'బఘీర'గా వేటాడుతూ ఉంటాడు. ఈ క్రమంలోనే మంగుళూరు బేస్‌గా పెద్ద హ్యూమన్ ట్రాఫికింగ్ నెట్‌వర్క్ నడుస్తుందని తెలుసుకుంటాడు. దాని వెనక నొటోరియస్ క్రిమినల్ రాణా (గరుడ రామ్) ఉన్నాడని తెలుస్తుంది. తర్వాత వేదాంత్ ఏం చేశాడు? రాణాకు ఎదురెళ్లక వేదాంత్ జీవితంలో వచ్చిన మార్పులేంటి? ఇవన్నీ తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

విశ్లేషణ:

ఇండియన్ స్క్రీన్ మీద 'విజిలాంటే' (తనెవరో తెలియకుండా జనాలకు మంచి చేసే హీరో) కథలు చాలా తక్కువగా వస్తాయి. 2019లో వచ్చిన తమిళ సినిమా 'హీరో' (తెలుగులో శివ కార్తికేయన్ శక్తి)', ఈ మధ్య తెలుగులో వచ్చిన నాని 'సరిపోదా శనివారం' ఈ తరహా సినిమాలే. ఇప్పుడు శ్రీమురళి నటించిన 'బఘీర' కూడా ఈ కోవలోకే వస్తుంది. నగరంలో బాగా రెస్పాన్సిబుల్ ఒక వ్యక్తి మంచి ధనికుడై ఉండటం, అతను రాత్రి పూట నగరంలోని నేరస్తులను ఎదుర్కోవడం అనేది 'బ్యాట్ మ్యాన్' కథ. స్థూలంగా చూస్తే 'బఘీర' కూడా అదే కథ. హీరో సిటీలో పోలీసుగా మంచి పొజిషన్‌లో ఉంటాడు. మొదట కండ బలంతో నేరాలను అపుతాడు. తర్వాత తనకున్న ధనబలంతో టెక్నాలజీ వాడి నేరస్తుల ఆట కట్టిస్తూ ఉంటాడు. ట్రీట్‌మెంట్ సరిగ్గా ఉంటే ఇలాంటి సినిమాలు బాక్సాఫీస్ దగ్గర అద్భుతాలు చేస్తాయి. కానీ 'బఘీర' అక్కడ వెనకపడింది.

సినిమా ఫస్టాఫ్ చాలా స్లోగా ఉంటుంది. తల్లి మాటలు విని హీరో పోలీస్ అవ్వడం వరకు ఓకే. కానీ సిస్టంకు వ్యతిరేకంగా 'విజిలాంటే' అవ్వడానికి తనకు ఎదురైన పరిస్థితులు అంత ఎఫెక్టివ్‌గా అనిపించవు. సిస్టంలో లేకుండా, అన్యాయానికి ఎదురెళ్లే అవకాశం లేనప్పుడు హీరో ఈ దారి ఎంచుకుంటే ఓకే కానీ పై అధికారుల ఒత్తిడి ఎదుర్కోలేక ఈ దారి ఎంచుకోవడం అంత కన్విన్సింగ్‌గా కూడా అనిపించదు. యాక్షన్ సీన్లు మాత్రం బాగా డిజైన్ చేశారు. ఫస్టాఫ్‌లో రేపిస్టులను చంపే యాక్షన్ సీన్ చాలా బాగా వచ్చింది. ఇంటర్వెల్ బ్లాక్‌ను కూడా బాగా డిజైన్ చేశారు.

అయితే సెకండాఫ్‌లో కూడా స్టోరీ అంత ఎఫెక్టివ్‌గా ఉండదు. హీరో ఎవరో ప్రపంచానికి తెలియనప్పుడు... విలన్‌కు, హీరోకు మధ్య ఫేస్ ఆఫ్ త్వరగా ఎస్టాబ్లిష్ చేస్తే క్యాట్ అండ్ మౌస్ గేమ్ ఇంట్రెస్టింగ్‌గా మారుతుంది. కానీ విలన్‌కి హీరో అనే వాడు ఒకడున్నాడు అని తెలిసేసరికే పుణ్యకాలం కాస్తా గడిచిపోతుంది. ఆ తర్వాత రెండు యాక్షన్ ఎపిసోడ్లతో సినిమా అయిపోతుంది. ఇందులో రుక్మిణి వసంత్ పాత్ర కూడా చాలా పేలవంగా ఉంది. హీరోయిన్ పాత్ర సరిగ్గా పాటకు ముందు వచ్చే సీన్‌లో కనిపిస్తుంది. తర్వాత మాయం అయిపోతుంది.

ఇక నటీనటుల విషయానికి వస్తే... '

విజిలాంటే' వేదాంత్‌గా శ్రీమురళి మెప్పిస్తాడు. మూడు సంవత్సరాల కాలం తను ఈ సినిమా మీదనే ఉన్నాడు. రుక్మిణి వసంత్ పాత్ర మరీ పేలవంగా ఉంది. తను చేయాల్సిన స్థాయి పాత్ర అయితే కాదు. విలన్‌గా గరుడ రామ్ స్క్రీన్‌పై క్రూరంగా కనిపిస్తాడు. హెడ్ కానిస్టేబుల్ పాత్రలో రంగాయణ రఘుకు మంచి పాత్ర దక్కింది. మిగతా పాత్రధారులందరూ ఓకే.

ఓవరాల్‌గా చెప్పాలంటే... ఈ 'బఘీర' కేవలం యాక్షన్ సీన్ల కోసం మాత్రమే.

శివకార్తికేయన్ హీరోగా నటించిన తాజా సినిమా ' అమరన్'. సాయి పల్లవి హీరోయిన్. రాజ్ కుమార్ పెరియసామి దర్శకత్వం వహించారు. సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, గాడ్ బ్లెస్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలతో కలిసి లోక నాయకుడు కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ నిర్మించారు. ఇది బయోగ్రాఫికల్ యాక్షన్ ఫిల్మ్. దీపావళి సందర్భంగా తెలుగు, తమిళ భాషల్లో విడుదల చేశారు. మరి, ఈ సినిమా ఎలా ఉందంటే?




కథ :

ముకుంద్ వరదరాజన్ (శివ కార్తికేయన్)ది చెన్నై. కాలేజీలో ఇందు రెబెక్కా వర్గీస్ (సాయి పల్లవి) పరిచయం అవుతారు. ఇద్దరూ ప్రేమలో పడతారు. అయితే... ముకుంద్ ఆర్మీలో చేరొద్దని ఇందు నాన్న, మతాలు వేరని కుటుంబ సభ్యులు మొదట పెళ్లికి ఒప్పుకోరు. ఇటు ముకుంద్ తల్లి కూడా ఇందు మతం వేరని మొదట అనాసక్తి చూపిస్తుంది.

ఇందు తండ్రిని, కుటుంబ సభ్యులను ముకుంద్ ఎలా ఒప్పించాడు? ఆర్మీలో చేరిన తర్వాత అంచలంచలుగా ఎలా ఎదిగాడు? ముఖ్యంగా కశ్మీర్ లోయలోని తీవ్రవాదులను ఎలా అణచివేశాడు? అతను ప్రాణాలు ఎలా కోల్పోయాడు? ఈ ప్రయాణంలో భర్త గురించి ఇందు ఎంత ఆలోచించింది? ఆమెకు ముకుంద్ ఏం చెప్పాడు? వాళ్లిద్దరి బంధం ఎలా ఉంది? అనేది తెరపై చూసి తెలుసుకోవాలి.

విశ్లేషణ :

బయోగ్రాఫికల్ యాక్షన్ ఫిల్మ్, అందులోనూ ఆర్మీ నేపథ్యంలో సినిమా తీసేటప్పుడు కథ, కథనాలు ఎలా ఉంటాయో సగటు ప్రేక్షకులు ఊహించడం కష్టం కాదు. తీవ్రవాదం మీద సైనికులు ఉక్కుపాదం మోపే సన్నివేశాల్లో కావాల్సినంత హీరోయిజం ఉంటుంది. యాక్షన్ ఎపిసోడ్స్ ఉంటాయని తెలుస్తుంది. 'అమరన్'లోనూ అంతే! అయితే... ఎమోషన్ యాంగిల్, ముఖ్యంగా ముకుంద్ - ఇందు మధ్య అనుబంధం సర్‌ప్రైజ్ చేస్తుంది. మనకు తెలియకుండా మనచేత కంటతడి పెట్టిస్తుంది.

సగటు ఆర్మీ అధికారి కథగా 'అమరన్' మొదలైంది. మధ్య తరగతి తల్లి ఎవరైనా కొడుకు ఆర్మీలోకి వెళతానని అంటే వద్దని అంటుంది. ఈ సినిమాలోనూ అంతే! ముకుంద్ - ఇందు ప్రేమకథ సైతం కొత్తగా అనిపించదు. 'మేజర్' ఛాయలు కొంత కనిపిస్తాయి. అయితే... సాయి పల్లవి ఎక్స్‌ప్రెస్సివ్ నటన లోపాల్ని కప్పేసింది. ఈ సినిమాలో పీక్ లెవెల్ పాయింట్ ప్రీ ఇంటర్వెల్ నుంచి మొదలైంది. ఆ టెర్రరిస్ట్ ఏరివేత ఆపరేషన్ అప్పటి వరకు జరిగిన కథను మరచిపోయి ఆ యాక్షన్ ఎపిసోడ్ చూసేలా చేసింది. ఇంటర్వెల్ తర్వాత ఆర్మీ ఆపరేషన్స్, కశ్మీర్ లోయలో ఘటనల కంటే ముకుంద్ - ఇందు మధ్య సన్నివేశాలు హృదయానికి ఎక్కువ హత్తుకుంటాయి.

ఆర్మీ నేపథ్యంలో ఇంతకు ముందు వచ్చిన సినిమాల్లో కుటుంబ సభ్యుల పరిస్థితి చూపించారు. అయితే... సాయి పల్లవి నటన ఆయా సినిమాల నుంచి 'అమరన్'ను వేరు చేసింది. భర్త ఇంటికి వచ్చినప్పుడు గానీ, భర్త మరణించాడని తెలిశాక గానీ... ఆయా సన్నివేశాల్లో సాయి పల్లవి నటన ఆమె ఎంత గొప్ప నటి అనేది చెబుతుంది. చెమ్మగిల్లిన కళ్లతో, బరువెక్కిన గుండెతో థియేటర్ల నుంచి ప్రేక్షకులు బయటకు వచ్చారంటే కారణం సాయి పల్లవి నటన అని చెప్పాలి. అందులో ఎటువంటి సందేహం అవసరం లేదు.

దర్శకుడు రాజ్ కుమార్ పెరియసామి సాయి పల్లవి ఎమోషన్ (ఆర్మీ అధికారుల ఫ్యామిలీ ఎమోషన్) ఆడియన్స్ ఫీలయ్యేలా తీయడంలో సక్సెస్ అయ్యారు. దాంతో థియేటర్ నుంచి బయటకు వచ్చేటప్పుడు ఉద్వేగానికి లోను అవుతారు. దర్శకుడికి సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ నుంచి మంచి మద్దతు లభించింది. సాంగ్స్ ఓకే. కానీ, నేపథ్య సంగీతంలో జీవీ తన టాలెంట్ చూపించారు. ముకుంద్ మరణ వార్త భార్యకు తెలిసిన సమయంలో కాసేపు నిశ్శబ్దం ఇవ్వడం వల్ల ప్రేక్షకులు ఆలోచనలు సైతం ఒక్క క్షణం ఆగుతాయి. సాయి పల్లవి ఏడుస్తుంటే స్క్రీన్ ముందు ఉన్న ప్రేక్షకులు కంటతడి పెడతారు. సినిమాటోగ్రఫీ బావుంది. కశ్మీర్‌ను బాగా క్యాప్చర్ చేశారు. ప్రొడక్షన్ వేల్యూస్ టాప్ క్లాస్ అని చెప్పాలి. ఇప్పటి వరకు శివకార్తికేయన్ చేసిన సినిమాలు ఒక ఎత్తు. ఈ సినిమా మరొక ఎత్తు. బాయ్ నెక్స్ట్ డోర్, లోకల్ యూత్, కమర్షియల్ ఫార్ములా కథల నుంచి ఆయన బయటకు వచ్చారు. బరువైన పాత్ర పోషించారు. ముకుంద్ జీవితంలో వివిధ దశలకు తగ్గట్టు లుక్ పరంగా వేరియేషన్, నటుడిగా పరిణితి చూపించారు. రాహుల్ బోస్, భువన్ అరోరా, గీతా కైలాష్ తదితరులు తమ పాత్రలకు న్యాయం చేశారు. ఆ పాత్రల పరిధి మేరకు నటించారు.

అమరన్... దేశం కోసం కుటుంబానికి, సరదాలకు దూరంగా పోరాటం చేసే మన సైనికులకు ఇచ్చిన చక్కటి నివాళి. సైనికుల త్యాగాలను మాత్రమే కాదు, ఆర్మీలోకి వెళ్లిన వ్యక్తులకు కుటుంబ సభ్యులు ఇచ్చే నైతిక మద్దతుతో పాటు వాళ్ల త్యాగాలను సైతం చూపించిన చిత్రమిది. బరువెక్కిన గుండెతో ప్రేక్షకులను బయటకు పంపే చిత్రమిది.

(గమనిక: వ్యక్తిగత జాతకము అనగా వ్యక్తి పుట్టి నపుడు అతని సమయం, స్థలం, జన్మ వివరాలు ఆధారముగా నిర్మించిన జన్మకుండలి ప్రకారము వ్యక్తికి నడుస్తున్న దశలు, అంతర్దశలు ప్రధానము. గోచారం ఫలితాలు చూసుకునేటప్పుడు ప్రధానముగా వ్యక్తిగత జాతకము లోని దశ అంతర్దశలు కూడా కలిపి చూసుకోవాలి. గోచార రీత్యా రాశి ఫలాలు అశుభము గా ఉండి దోషాలు ఉన్నప్పటికీ, జననకాల దశ ఫలములు శుభము గా ఉంటే రాశి ప్రస్తుత అశుభ ఫలితాలు స్వల్పంగానే ఉంటాయి. చిన్న చిన్న పరిహారాలు పాటించి శుభ ఫలితాలు పొందగలరు)

నిర్వహణ :
స్వర్ణకంకణ సన్మానిత,
జ్యోతిష్య చూడామణి,
జ్యోతిర్వాస్తు ప్రజ్ఞా విశారద
డా//ఈడ్పుగంటి పద్మజారాణి
91 9849250852,
91 7506976164
padma.suryapaper@gmail.com



# 3.11.2024 నుంచి 9.11.2024 వరకు



## మేష రాశి

అశ్విని 1,2,3,4 పాదములు , భరణి 1,2,3,4 పాదములు కృత్తిక 1వ పాదము

వారం ప్రారంభంలో ఆరోగ్యపరమైన విషయాలలో వ్యక్తిగత శ్రద్ధ అవసరము. ఖర్చులు ఊహించిన దానికన్నా ఎక్కువగా ఉంటాయి. ఉద్వేగాలను, కఠినమైన మాటలను కోపాన్ని నియంత్రించు కోవాలి కుటుంబ సంబంధమైన ప్రయాణములు, భాగస్వామ్య వ్యవహారాలలో అపార్థాలు రాకుండా జాగ్రత్త వహించాలి. విద్యార్థులకు అనుకూలంగా ఉంటుంది. కమ్యూనికేషన్ బాగుంటుంది. జ్ఞాపక శక్తిని పెంచుకునే విధంగా కృషి చేస్తారు. వ్రాత నైపుణ్యాలు బాగుంటాయి. కొత్త పెట్టుబడుల గురించి ఆలోచన చేస్తారు.విద్యార్థులకు విద్యారమైన ప్రయాణాలకు అవకాశం ఉంది. సంతానమునకు సంబంధించిన అభివృద్ధి నిర్ణయాలు తీసుకునేటప్పుడు ఆచి తూచి వ్యవహరించాలి. గృహ, విద్య వాహన,వాతా వరణం లో కొంత అసౌకర్యం



## వృషభరాశి

కృత్తిక 2,3,4 పాదములు ,రోహిణి 1,2,3,4 పాదములు మృగశిర 1,2 పాదములు

వారం ప్రారంభంలో ఆత్మీయుల సహకారము తోడ్పాటుతో అనుకున్న పనులు సాధించుకుంటారు. రాజకీయంగా పలుకుబడి కలిగిన వ్యక్తులు ఉన్నత అధికారులు సలహా సంప్రదింపులతో కొంత కాలముగా ఆగి ఉన్న పనులను మొదలు పెడతారు. నిర్ణయి సామర్థ్యం బాగుంటుంది పరాక్రమం పెరుగుతుంది.సంతృప్తి పెరుగుతుంది.చమత్కారంగా మాట్లాడతారు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. .విద్యార్థులకు అనుకూలంగా ఉంటుంది, కానీ విద్య పట్ల శ్రద్ధ పెంచుకోవాలి. సమయస్ఫూర్తిగా వ్యవహరిస్తూ పనులు సాధించుకుంటారు. ఉద్వేగాలు అధికంగా ఉంటాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాలుముందుకుసాగుతాయి.ఆధ్యాత్మికపరమైన ఆలోచనలతోప్రయాణాలు కొరకు ఆలోచిస్తారు. బంధువుల్ని, ప్రియమైన వ్యక్తుల్ని కలుస్తారు.



## మిధున రాశి

మృగశిర 3,4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు పునర్వసు 1,2,3 పాదములు

వారం ప్రారంభంలో కుటుంబంలో మీ ఆధిపత్యం పెరుగుతుంది. ఖర్చులు మాత్రమే కాకుండా ఆరోగ్య విషయంలో కూడా కొంత శ్రద్ధ తీసుకోవాలి.వాగ్దానం నిలబెట్టుకోవడం కొంతవరకు కష్టం అవుతుంది.ధన విషయంలో ఆటంకాలు.శక్తికిమించినఖర్చులు.వృత్తిపరమైన అధిక శ్రమతో నిద్రలేమి ఇబ్బంది పెడుతుంది.నూతన శక్తితో మనసు ఉత్సాహంగా కొత్త నిర్ణయాలు కొరకు ఆలోచనలు చేస్తుంది. విందు వినోదాల్లో ఖర్చులు అధికము.శారీరక శ్రద్ధ,వ్యాయామ ప్రాణయమాలు చేస్తారు.గౌరవము కీర్తి పెరుగుతుంది.సంఘంలో గుర్తింపు,కుటుంబంతో, మిత్రులతో కలిసిసమయాన్నిసద్వినియోగపరచుకుంటారుతోబుట్టులతోఅభిప్రాయబేధాలురాకుండాజాగ్రత్తగావ్యవహరించాలి.



## కర్కాటక రాశి

పునర్వసు 4వ పాదము పుష్యమి 1,2,3,4 పాదములు ఆశ్లేష 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో. కుటుంబ పరమైన విషయాల్లో, బంధువుల కొరకు ఖర్చులు చేస్తారు శిరోవేదనశారీరక శ్రమ నిద్రలేమి, కొంత ఇబ్బందిని కలిగిస్తాయి. ఆరోగ్య పట్ల శ్రద్ధ పెంచడం మేలు. మాట్లాడే మాటల వల్ల అభిప్రాయ బేధాలు రాకుండా జాగ్రత్త పడాలి. కంటికి సంబంధించిన విషయాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఉన్నత విద్య కోసం చేసే ప్రయత్నాలు అనుకూలంగా ఉంటాయి. గృహ, వాహన పరమైన లాభాలు. తల్లితండ్రుల సహకారం నిర్ణయాలు తీసుకుంటారు. ఉన్నత అధికారుల సహకారంతో అనుకున్న పనులు అనుకున్న సమయానికి పూర్తిచేస్తారు. నూతన వ్యక్తులు పరిచయాలు.కుటుంబ విషయాలలో ఇతరుల జోక్యం మీకు చిరా కును కలిగిస్తుంది. కుటుంబంలోని స్త్రీలతో విభేదాలు రాకుండా జాగ్రత్త వహించాలి



## సింహ రాశి

మఖ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు ఉత్తర 1వ పాదము

వారం ప్రారంభంగవర్నమెంట్ ఉద్యోగులతో విభేదాలు రాకుండాజాగ్రత్తవహించాలి. గురువుల ఆశీస్సులు లభిస్తాయి ఆకస్మిక వైరాగ్యం ప్రశాంతత తగ్గిస్తుంది.సంతానం వృద్ధి పరంగా ముందుకు సాగుతారు. మీ ఆలోచన విధానం బాగుంటుంది నిర్ణయ సామర్థ్యం పెరుగుతుందిఉద్వేగాలకు లోనై కుటుంబ సంబంధమైన ముఖ్యమైన కార్యక్రమాల లో ఇబ్బందులకు గురవుతారు. ఆ విషయంలో జాగ్రత్త అవసరము. చివరికి వాటన్నిటిని అధిగమిస్తూ కుటుంబ కార్యక్రమాల్లోపాల్గొంటారుఆరోగ్య విషయంలో, ముఖ్యంగా సంతానము కంటి ఆరోగ్య శ్రద్ధ అవసరము, ఇష్టమైన కార్యక్రమాల్ని నిర్వహిస్తారు, కుటుంబంలోవాతావరణం అనుకూలంగాఉంటుంది.ఎదురుచూస్తున్న వర్తమానాలు అందుకుంటారు మొత్తం మీద లాభదాయకము



## కన్యా రాశి

ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు చిత్త 1,2 పాదములు

ప్రారంభంలోదూర ప్రదేశాలలో ఉన్నత విద్య కొరకు ప్రయత్నం చేసేవిద్యార్థులకు అధికశ్రమతో కొంతవరకు అనుకూలంగాఉంటుందినూతనబాధ్యతలుపెరుగుతాయి శ్రమ పెరుగు తుంది.వృత్తిపరమైనఅంశాలుఅనుకూలంగాఉంటాయివ్యాపారపరమైనఅంశాలలోజాగ్రత్తలుతీసుకోవాలి.తొందరపాటు నిర్ణయాలు తీసుకోకూడదు. భాగస్వామితో కలిసి కుటుంబ పరమైన ప్రయాణాలు ఇబ్బంది పడకుండా జాగ్రత్త వహించాలి. వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ అవసరము.దూర ప్రదే శంలో ఉండే వ్యక్తులతో మాట్లాడేటప్పుడు జగడములు రాకుండా జాగ్రత్తలుతీసుకోవాలి. సంతానానికిఅభివృద్ధి పరంగాఉంటుంది నూతనపెట్టుబడులు కొరకుఆలోచనలు చేస్తారు. విద్యార్థులు జ్ఞాపకశక్తిని పెంచుకోవాలి చదువు పై శ్రద్ధ అవసరం.



## తులారాశి

చిత్త 3,4 పాదములు స్వాతి 1,2,3,4 పాదములు , విశాఖ 1,2,3 పాదములు

వారం ప్రారంభంలోతోబుట్టువులతో అభిప్రాయ బేధములు రాకుండా జాగ్రత్త తీసుకోవాలివారసత్వపు ఆస్తులచర్చల మీద, భూమి కి సంబంధించిన అంశాలపట్ల శ్రద్ధ తీసుకుంటారు మీఆరోగ్యవిషయంలో, రహస్యశత్రువుల అంశాలలో కొత్త ఘర్షణ ఉంటుంది.వృత్తిపరంగా అనుకూలంగాఉంటుందిఉన్నతాధికారులుసహకరిస్తారు కొత్త బాధ్యతలు అప్పచెప్తారుదూర ప్రదేశములలో ఉండే వ్యక్తుల సహకారంతో పనుల కోసం ప్రణాళికలు ఏర్పరచుకుంటారు.. గృహ సంబంధ అంశాల కొరకు వాహన మార్పుల కొరకు ఆలోచన చేస్తారు. మానసిక ప్రశాంతత తగ్గినప్పటికీ పట్టుదలగాపనులనుసాధించుకుంటారు.విద్యార్థులకుఅనుకూలంగాఉంటుంది భాగస్వామికి సంబంధించిన విషయాలలో, ప్రయాణానికి విషయాలు కొంతవరకుసంతృప్తిఫలితాలు ఇస్తాయి.



## వృశ్చిక రాశి

విశాఖ 4 పాదము అనురాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలోభాగస్వామికి సంబంధించిన వృత్తిపరమైన విషయాలలో, ఆదాయ అంశాలలో ఆకస్మిక మార్పులు. వివాహ సంబంధమైన అంశాలలో తొందరపాటు నిర్ణయాలు తగవు. దీర్ఘకాలిక పెట్టుబడుల విషయంలోనూ, ఇష్టమైన వ్యక్తులతో అభిప్రాయ బేధాలు, ఘర్షణలు రాకుండా జాగ్రత్త వహించాలి.సంఘాల్లో వ్యాపార రంగంలో అనుభవం ఉన్న నూతన వ్యక్తుల పరిచయాలు. చేస్తున్న పనుల పట్ల అసంతృప్తి ఆటంకాలు. క్రిందపనిచేసేవ్యక్తుల సహకారాన్ని కోరుకుంటారు సమయానికి వారుఅందించటం వల్ల ముఖ్యమైన పనుల ఎకొంతవరకుముందుకుసాగుతాయ.ఉన్నత విద్య కోసం ప్రయత్నం చేసే విద్యార్థులకు అధిక శ్రమ. తండ్రితో చర్చించి నెమ్మదిగా నిర్ణయాలు తీసుకోవడం కొంతవరకు మంచిది. రావలసిన లాభాలు వాయిదా పడటం వల్ల చికాకులు.



## ధనస్సు రాశి

మూల 1,2,3,4 పాదములు పూర్వాషాఢ 1,2,3,4 పాదములు ఉత్తరషాఢ 1వ పాదము

వారం ప్రారంభంలోమీ శక్తి మీద మీకు నమ్మకం పెరుగుతుందిరోగ నిరోధక శక్తితో పాటు శత్రువులపై విజయం సాధిస్తారు. నూతన వృత్తులకు అవకాశాలు లభిస్తుంది సంఘములోగౌరవంకీర్తిప్రతిష్టలునూతనపరిచయాలు, భాగస్వామి కి గౌరవం.రుణాలు చెల్లిస్తారుఆగిపోయిన పనులు ముందుకు పెడతాయి. ఇతర సహకారంతో అనుకున్న పనులను పెద్ద శ్రమ లేకుండాసాధించుకుంటారు. శ్రమకు తగిన సన్మానాలు పొందుతారు.ఉన్నత అధికారులతో, ప్రభుత్వ రంగంలో ఉండే వ్యక్తులతో నిదానంగా వ్యవహరించి పనులు ముందుకు తీసుకువెళ్లాలి. గౌరవం తగ్గకుండా చూసుకోండి. ముఖ్యమైన పనులలో ఆటంకాలు మానసిక ఒత్తిడిని పెంచుతాయి.సంతానానికి సంబంధించిన అంశాలలో కొంతవరకు శుభవార్తలు వింటారు.



## మకర రాశి

ఉత్తరషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు ధనిష్ట 1,2 పాదములు

వారం ప్రారంభంలో తోబుట్టువులు విషయాలు, వృత్తి సంబంధించిన ఆలోచనలు ప్రశాంతతను తగ్గిస్తాయి. పట్టుదలగావ్యవహరించిమిత్రులసహకారంతో,మీనైపుణ్యమైనకమ్యూనికేషన్తోసాధించుకుంటారు.దీర్ఘకాలిక అనారోగ్యాల విషయంలో శ్రద్ధ అవసరం.విద్యార్థులకు ఉన్నత విద్య, మీ ఆధ్యాత్మిక విషయాలలో కొంతవరకు ముందుకు పెడతాయి సంతాన అభివృద్ధి పరంగా ముందుకు వెళుతుంది. సంఘంలో గుర్తింపు గౌరవం నూతన పరిచయాలు ఏర్పడతాయి. నూతన వృత్తి కొరకు చేయు ప్రయత్నాలు,ఆగిన పనులు ముందుకు వెళతాయి. ఆరోగ్యం బాగుంటుంది. మీ దగ్గర తీసుకున్న రుణము ఇతరులు ఇంతవరకు మీకు చెల్లిస్తారు. పోటీలలో అధిక శ్రమతో నెగ్గుతారు. తల్లి తరపు బంధువర్గాన్ని కలుస్తారు..



## కుంభ రాశి

ధనిష్ట 3,4 పాదములు శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు

వారం ప్రారంభంలో పాత ఆలోచనలు అదేపనిగా గుర్తుకువస్తూ మనసులో స్థిరత్వం తక్కువ.సృజనాత్మకత, భాగస్వామి సంబంధ ఆత్మీయుల రాకపోకలు, సంతాన సంబంధం నూతన పెట్టుబడులు, గృహ సంబంధ ఆదాయాల మీద చర్చలు ఆలోచనలు భూసంబంధ విషయాల గురించి పెట్టుబడుల గురించి,ముందుసాగుతాయి. విందు వినోదాలులో పాల్గొనడం, ఉపాసన బలం పెంచుకోవడం.మానసిక ప్రశాంతత చాలా వరకు తక్కువగా ఉంటుంది. సంఘంలో పలుకుబడి కలిగిన వ్యక్తుల సహకారంతోపనులుసాధించుకుంటారు, ఇంతవరకు ఆగిన పనులు అవలీలగా ముందుకు సాగుతాయి, ఆరోగ్య విషయంలో శ్రద్ధ అవసరము రోగనిరోధక శక్తినిపెంచుకోవాలి, పాత రుణములను కొంతవరకు తీరుస్తారు.



## మీనరాశి

పూర్వాభాద్ర 4 వ పాదము ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు రేవతి 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో వృత్తిపరమైన అభివృద్ధి. ప్రయాణాలు అనుకూలంగా ఉంటాయి ధైర్య సాహసాలు పెరుగుతాయి .స్వతంత్రంగా ఆలోచనలు చేస్తారు.సంతాన పరమైన విషయాలలో సృజనాత్మకఅంశాలలోెపెట్టుబడికిసంబంధించిన ఆలోచనలలో కొత్త నైపుణ్యాలను ప్రదర్శిస్తారువ్రాత నైపుణ్యాలు పెరుగుతాయి.పట్టుదలగా అనుకున్న పనులు సాధిస్తారు. విద్యా వాహన గృహ సౌకర్యాలు అనుకూలంగా ఉంటాయి.విద్యార్థులు పోటీ పరీక్షలలో శ్రమ తో విజయాన్ని సాధిస్తారు.గృహ వాహన సంబంధ అంశాల కొనుగోలు కొరకు లాభకరమైన నిర్ణయాలు చేయడం జరుగుతుంది. వృత్తిపరంగా అభివృద్ధి, గౌరవం పెరుగుతుంది. నూతన గృహ సంబంధ వస్తువులకు కొనుగోలు కొరకు ఆలోచనలు చేస్తారు.

# అనసూయ భరద్వాజ్



# తెలంగాణ సాంస్కృతికి ప్రతీక

# సదర్ ఉత్సవం




**పండగ రోజుల్లో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉంటారు. ఊరు, వాడ ఏకమై ప్రజలంతా ఒక్కచోట చేరి పండగలను ఆనందంగా జరుపుకుంటారు. ఉగాది, దసరా, దీపావళి, వినాయక చవితి, బతుకమ్మ, బోనాలు ఇలా రకరకాల పండగలు ఉన్నాయి. ఒక్కో పండగ ఒక్కో ప్రత్యేకతను కలిగి ఉంటుంది. అయితే ఈ పండగలన్ని పల్లెలు, పట్టణాల్లో జరుపుకుంటారు. ఇక ఇప్పుడు దీపావళి సందడి లో భాగంగా హైదరాబాద్‌లో గుర్తొచ్చేది సదర్ ఉత్సవాలు. యాదవులు సాంస్కృతిక ప్రతీకగా సదర్ ఉత్సవాలు జరుపుకుంటారు. అయితే సదర్ ఉత్సవాలు హైదరాబాద్ లో మాత్రమే జరుపుకుంటారు. మహైదరాబాద్ నగరంలో సదర్ ఉత్సవాలను ధూమ్ ధామ్ గా నిర్వహిస్తారు. సదర్ అనే ఉర్దూ పదానికి ఆత్మ విశ్వాసం, లీడర్ అనే అర్థాలు ఉన్నాయి. సదర్ అంటే హైదరాబాదీ వ్యవహారికం ప్రకారం ప్రధానమైనది అని అర్థం. హైదరాద్ లో జరిగే ప్రధాన ఉత్సవాల్లో సదర్ ఉత్సవం ఒకటి. నగరంలోని యదవులు మాత్రమే సదర్ ఉత్సవాలను జరుపుకుంటారు. దీపావళి ముగిసిన రెండు రోజులకు సదర్ ఉత్సవాలను జరుపుకుంటారు. దీన్ని దున్నపోతుల ఉత్సవం అని కూడా అంటారు. అలంకరించిన దున్నపోతులతో యువకులు కుస్తీ పట్టడం ఈ ఉత్సవం ప్రత్యేక విశేషం. వివరాలలోకి వెళితే...**

**అలనాటి సమాజంలో వారి వృత్తే-వారికి గుర్తింపు,
వారి జీవన విధానంలో భాగమైన పనులే- వారి పండుగలు,
అవే నేటికీ వారి-సాంస్కృతిక ప్రతీకలు,
అటువంటివే నేటి-సదర్ ఉత్సవాలు.**

భిన్న సంస్కృతి,సాంప్రదాయాలకు నిలయం హైదరాబాద్ నగరం.ఏటా సరిగ్గా దీపావళి సమయానికి జంటనగరాలు మరో విభిన్నమైన ఉత్సవాలు జరుపుకోవడానికి ముస్తాబవుతాయి.అవే సదర్ ఉత్సవాలు. దీన్నే వృషభోత్సవం అని కూడా అంటారు. సదర్ అనే ఉర్దూ పదానికి ఆత్మ విశ్వాసం,లీడర్,అనే అర్థాలు ఉన్నా యి.”సదర్”అంటే హైదరాబాది వ్యవహారికం ప్రకారం “ప్రధానమైనది” అని అర్థం.యాదవ సామాజిక వర్గం అత్యంత వైభవంగా నిర్వహించే ఈ సదర్ ఉత్సవాల నిర్వహణ వెనుక పెద్ద చరిత్రే ఉంది.

ఈ సదర్ ఉత్సవాలు ఐదు వేల సంవత్సరాల క్రితం నాటి సింధు నాగరికతలో భాగంగా ప్రారంభమై దేశ వ్యాప్తంగా విస్తరించినప్పటికి తరువాతి కాలంలో కనుమరుగై అక్కడక్కడ స్థానిక ప్రాంతాలకు మాత్రమే పరిమితమైనాయి. ఈ ఉత్సవాలు మన రాష్ట్రానికి దేవగిరి యాదవ రాజుల కాలంలో వ్యాప్తి చెందాయి.

కాకతీయ రాజుల కన్నా ముందే యాదవులు గొల్లకొండగా పిలిచే ప్రస్తుత గోల్కొండను కేంద్రంగా చేసుకుని జీవించేవారని చరిత్ర చెబుతోంది.తరువాత కాలంలో గొల్లకొండ ప్రాంతాన్ని (ప్రస్తుతం గోల్కొండ ప్రాంతం) పాలించే గొల్లల రాణి (యాదవుల రాణి) కుతుబ్ షాహీ దండయాత్రలను ఐదు దున్నపోతుల సహాయంతో ఎదుర్కొని పోరాడి వీర మరణం పొందిందని,తర్వాత కాలంలో గొల్లకొండ గోల్కొండగా మారినా రాణి,దున్నపోతుల వీరత్వానికి ప్రతీకగా సదరు ఉత్సవాలు జరుపుతున్నట్లు ఒక నానుడి ఉంది.

యాదవ వీరులు కుతుబ్ షాహిలు,మొగలులు మరియు నిజాంముల కాలంలో సైనిక అధికారులుగా,అంగరక్షకులుగా సమర్థవంతంగా పనిచేశారు.నిజాం వారి సేవలను గుర్తించి గౌలిగూడను (ఒకప్పుడు దీన్ని గొల్లగూడ అనేవారు.అక్కడ పాల ఉత్పత్తులు ఎక్కువగా అమ్మడం వల్ల ఆ పేరొచ్చింది.)ఇనామ్ గా ఇచ్చాడని చరిత్ర చెబుతుంది.

**(మిగతా 8వ పేజీలో)**

